www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 79 | | 2-9-2026 | | బుధవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |

## కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ భేటీ

■ తాజా రాజకీయాలపై చర్చ 2



సింగరేణి బొగ్గు గనుల్లో ప్రైవేటు సంస్థల ప్రవేశానికి రంగం సిద్ధమవుతోంది. భారీ నష్టాల్లో కొనసాగుతున్న భూగర్భ గనులను గని అభివృద్ధి, నిర్వహణ (ఎండీవో) విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రతిపాదనలను సింగరేణి పరిశీలిస్తోంది. కేంద్ర బొగ్గు శాఖ సూచనల మేరకు నష్టాలను తగ్గించుకునే మార్గాల్లో భాగంగా ఈ దిశగా అడుగులు వేస్తోంది.



## ప్రళయం
### అంతులేని శోకం

ఇంకా వరదల్లో 275 మంది భారతీయులు

ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు



2

# సింగరేణిలో 'ప్రైవేటు' అడుగులు!

■ నష్టాల గనులను ఎండీవోకు ఇచ్చే యోచన
■ తొలుత శాంతిఖనితో ప్రయోగానికి సన్నాహాలు
■ 21 భూగర్భ గనుల్లో 1,924 కోట్లకు పైగా నష్టాలు
■ ఆడ్రియాలలో టన్నుకు రూ.27 వేలకుపైగా నష్టం
■ త్వరలో టెండర్లకు సింగరేణి కసరత్తు

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** సింగరేణి బొగ్గు గనుల్లో ప్రైవేటు సంస్థల ప్రవేశానికి రంగం సిద్ధమవుతోంది. భారీ నష్టాల్లో కొనసాగుతున్న భూగర్భ గనులను గని అభివృద్ధి, నిర్వహణ (ఎండీవో) విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రతిపాదనలను సింగరేణి పరిశీలిస్తోంది. కేంద్ర బొగ్గు శాఖ సూచనల మేరకు నష్టాలను తగ్గించుకునే మార్గాల్లో భాగంగా ఈ దిశగా అడుగులు వేస్తోంది. కోల్ ఇండియా, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ వంటి సంస్థల్లో ఎండీవో విధానాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో సింగరేణిలోనూ దీనిని ప్రయోగాత్మకంగా

మిగతా 2 లో

## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు 2

అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు

ఈక్విటీ ఆధారంగా ఐదు కేటగిరీలు

రిస్క్ స్థాయిని బట్టి పథకాల వర్గీకరణ

ప్రభుత్వ ఖాతాలకు మినహాయింపు




## ఢిల్లీకి చేరిన కొండా పంచాయితీ

హైకమాండ్ నుంచి సురేఖకు పిలుపు..!

కేసీ వేణుగోపాల్‌తో సురేఖ భేటీ ఛాన్స్!

రాజకీయ ప్రకంపనలు రేపుతున్న పరిణామాలు

2



## అదనపు సంచాలకుడిగా డీఎస్ జగన్

సమాచార శాఖలో పదోన్నతి

బాధ్యతలు స్వీకరించిన జగన్

అభినందించిన మంత్రి పొంగులేటి

సమన్వయంతో పని చేయాలని సూచన

2



## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి



■ బంగారాన్ని అనవసరంగా కొనకండి
■ డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
■ దేశప్రజల సమిష్టి కృషితోనే జీడీపీ వృద్ధిరేటు
■ దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
■ ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు

4



## తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?

● తెరపైకి రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు
● ఇప్పుడే అలాంటి చర్చ అవసరం లేదన్న ట్రంప్

4

## కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

■ కవిత దొంగచాటుగా కాంగ్రెస్‌లో ప్రవేశించే యత్నం చేయలేదా
■ ఎవరి స్వలాభం కోసం ఆమె విమర్శలు చేస్తున్నారో తెలుసు
■ కష్టకాలంలో మేము మాత్రమే కేసీఆర్‌ను వెన్నంటి ఉన్నాం
■ కవిత వ్యాఖ్యలపై మండిపడ్డ వేముల

3





## కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సానుకూలత

■ 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన
■ నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన
■ సాంకేతిక నివేదిక అనంతరం తదుపరి చర్యలు
■ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రామ్మోహన్ నాయుడి హామీ

3

## జీడీపీ వృద్ధిరేటు గణాంకాల గారడీ

● ధరలు మోత మోగిస్తుంటే.. వృద్ధి ఎలా సాధ్యం
● ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరాం రమేశ్



.. వివరాలు 4లో

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లపై స్టే ఎత్తివేత



2

తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట

సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించిన హైకోర్టు

## మిర్యాలగూడ బీఆర్ఎస్ రైతు ర్యాలీకి అనుమతి నిరాకరణ

■ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్న పోలీసులు
■ గ్రౌండ్ లేదా, హాలు లాంటి చోట్ల అయితే అభ్యంతరం లేదని వెల్లడి

3



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక





## కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీ

**తాజా రాజకీయాలపై చర్చించినట్లు సమాచారం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇటీవలి రాజకీయ పరిమాణాలపై ఇరువురి మధ్య కీలక చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు, వారు ఇచ్చిన వివరణ తదితర అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ చర్చించినట్లు తెలుస్తోంది.

## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు

**అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో కీలక మార్పులకు రంగం సిద్ధమైంది. ఎన్‌పీఎస్ పథకాల వర్గీకరణ, వాటి వివరాలను పెట్టుబడిదారులకు వెల్లడించే విధానంలో పెన్షన్ నియంత్రణ సంస్థ పీఎఫ్‌ఆర్‌డీఏ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఆగస్టు 28న జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం ఈ మార్పులు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. కొత్త విధానంలో ఎన్‌పీఎస్ పథకాలను వాటిలోని ఈక్విటీ పెట్టుబడి శాతం ఆధారంగా ఐదు కేటగిరీలుగా విభజించనున్నారు. తద్వారా పెట్టుబడిదారులు తమ రిస్క్ సామర్థ్యానికి అనుగుణంగా పథకాన్ని సులభంగా ఎంచుకునే అవకాశం కలుగుతుందని భావిస్తున్నారు. 80 నుంచి 100 శాతం వరకు ఈక్విటీ పెట్టుబడులు ఉండే పథకాలను 'కేటగిరీ–ఏ'గా వర్గీకరించి అత్యధిక రిస్క్‌తో కూడిన 'అగ్రెసివ్ గ్రోత్' పథకాలుగా చూపిస్తారు. 60 నుంచి 80 శాతం ఈక్విటీ ఉన్న పథకాలు 'కేటగిరీ––బీ'లోకి వస్తాయి. వీటిని అధిక రిస్క్ ఉన్న 'హై గ్రోత్' పథకాలుగా పేర్కొంటారు. 35 నుంచి 60 శాతం ఈక్విటీ ఉన్న పథకాలను 'కేటగిరీ–సీ'గా వర్గీకరించి 'బ్యాలెన్స్‌డ్ గ్రోత్' పథకాలుగా చూపిస్తారు. 10 నుంచి 35 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ–డీ'లోకి వస్తాయి. వీటిని తక్కువ రిస్క్‌కు ప్రాధాన్యమిచ్చే 'కన్జర్వేటివ్' పథకాలుగా పరిగణిస్తారు. సున్నా నుంచి 10 శాతం వరకు ఈక్విటీ ఉన్న పథకాలు 'కేటగిరీ–ఈ'లో ఉండి ప్రధానంగా రుణ ఆధారిత పెట్టుబడులకు ప్రాధాన్యం ఇస్తాయి. ఒక పథకంలోని ఈక్విటీ పరిమితి రెండు కేటగిరీల్లోకి వచ్చేలా ఉండకూడదని కొత్త నిబంధనల్లో స్పష్టం చేశారు. ఎన్‌పీఎస్‌లో కొత్తగా చేరేవారికి మరో మార్పు అమల్లోకి రానుంది. అక్టోబర్ 1 నుంచి 'పాయింట్ ఆఫ్ ప్రజెన్స్' ద్వారా కొత్తగా ఎన్‌పీఎస్ ఖాతా తెరిచేవారి ఒక్కో పీఆర్‌ఏఎన్‌పై రూ.200 ఒకేసారి చెల్లించాల్సిన ఛార్జీ విధించనున్నారు. అయితే ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా నాలుగు త్రైమాసికాల్లో రూ.50 చొప్పున సంబంధిత యూనిట్లను రద్దు చేయడం ద్వారా వసూలు చేయనున్నారు. పెట్టుబడిదారులు పథకాన్ని ఎంచుకునే ముందు స్పష్టమైన సమాచారం పొందేలా కొత్త విధానాన్ని రూపొందించారు. ఇకపై పథకం పేరు, పెన్షన్ ఫండ్, ప్రారంభ తేదీ, గత రాబడులు, బెంచ్‌మార్క్, ఛార్జీలు, రిస్క్‌మీటర్, నిర్వహణలో ఉన్న ఆస్తుల వివరాలను ఒకే విధానంలో ప్రదర్శించనున్నారు. దీంతో వివిధ పథకాల మధ్య తేడాలను సులభంగా అర్థం చేసుకోవడంతో పాటు రిస్క్, రాబడులను పోల్చుకుని నిర్ణయం తీసుకునేందుకు చందాదారులకు అవకాశం లభించనుంది. అయితే కొత్త వర్గీకరణ ప్రభుత్వ రంగ ఎన్‌పీఎస్ ఖాతాలకు వర్తించదు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లపై స్టేఎత్తివేత

**సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించిన హైకోర్టు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం రద్దు చేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్‌చేస్తూ ప్రభుత్వం దాఖలుచేసిన అప్పీలుపై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ పథకాల నిమిత్తం ప్రభుత్వం 2014 నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాల్‌చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందన్నారు. ఈ పథకాల అమలు.. పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడంలేదని, అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతేకాకుండా పథకం లబ్దిదారు కూడా కాదన్నారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని పేర్కొన్నారు. షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, అలాంటిదే కల్యాణలక్ష్మి పథకమన్నారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్హం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందన్నారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## హైడ్రా రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

**సింగిల్ జడ్జ్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హై కోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆర్డర్‌ను డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి విచారణ నవంబర్ 3వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. అప్పటి వరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని మార్చాలనే సింగిల్ బెంచ్ ఆర్డర్‌ను తాత్కాలికంగా డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి ఆదేశాల వరకు లోతుకుంటా భూముల జోలికి వెళ్లవద్దని హై కోర్టు స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసుపై అప్పీల్‌కు హైడ్రా కమిషనర్ వెళ్లిన విషయం తెలిసిందే. ఇదే కేసులో రంగనాథ్‌ని తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో తీర్పునిచ్చారు. ఈ క్రమంలోనే సింగిల్ జడ్జి తీర్పుని హైడ్రా కమిషనర్ రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు.

# సింగరేణిలో 'ప్రైవేటు' అడుగులు!

మొదటి పేజీ తరువాయి

చేపట్టాలని భావిస్తున్నారు. తొలుత మందమర్రి ప్రాంతంలోని శాంతిఖని భూగర్భ గనిని ఈ విధానంలో అప్పగించేందుకు ప్రైవేటు సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణలను ఆహ్వానించగా ఒక సంస్థ ముందుకొచ్చినట్లు సమాచారం. దీంతో త్వరలో టెండర్లు పిలిచేందుకు సింగరేణి కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎండీవో విధానంలో గనిని ప్రైవేటు సంస్థకు అప్పగిస్తే.. సదరు సంస్థ తన సొంత ఖర్చుతో బొగ్గును వెలికితీసి ముందుగా నిర్ణయించిన ధరకు సింగరేణికి అందిస్తుంది. అనంతరం ఆ బొగ్గును సింగరేణి మార్కెట్‌లో విక్రయిస్తుంది. ప్రస్తుతం శాంతిఖని భూగర్భ గనిలో టన్ను బొగ్గు ఉత్పత్తికి రూ.21,558 వరకు వ్యయం అవుతుండగా.. విక్రయ ధర రూ.4,167 మాత్రమే ఉన్నట్లు సంస్థ లెక్కలు చెబుతున్నాయి. అంటే టన్నుకు రూ.17 వేలకుపైగా వ్యత్యాసం ఉంటోంది. ఎండీవో విధానంతో ఈ భారాన్ని తగ్గించుకోవచ్చని యాజమాన్యం భావిస్తోంది. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై భూగర్భ గనుల్లో పెరుగుతున్న ఉత్పత్తి వ్యయం తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉద్యోగుల వేతనాలు, స్థిర, చర వ్యయాలను కలిపితే టన్ను బొగ్గు ఉత్పత్తికి అయ్యే ఖర్చుకు.. మార్కెట్‌లో దాని విక్రయ ధరకు భారీ వ్యత్యాసం ఉంటోంది. 2025 చివరి నాటికి సంస్థకు ఉన్న 22 భూగర్భ గనుల్లో 21 నష్టాల్లో ఉన్నట్లు కేంద్రానికి సమర్పించిన నివేదికలో సింగరేణి పేర్కొంది. ఈ గనుల ద్వారా రూ.1,924 కోట్లకు పైగా నష్టాలు వచ్చినట్లు వెల్లడించింది. ఆడ్రియాల భూగర్భ గనిలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



అక్కడ టన్ను బొగ్గు ఉత్పత్తికి రూ.30,333 వరకు వ్యయం అవుతుండగా.. విక్రయ ధర రూ.2,492 మాత్రమే ఉన్నట్లు సంస్థ పేర్కొంది. దీంతో టన్నుకు రూ.27,841 మేర నష్టం వస్తోంది. ఈ ఒక్క గనిలోనే గతేడాది రూ.302.87 కోట్ల నష్టం నమోదైనట్లు తెలిపింది. సింగరేణి ప్రస్తుతం 21 భూగర్భ, 17 ఓపెన్‌కాస్ట్ గనులను నిర్వహిస్తోంది. ఓపెన్‌కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలతో పెద్దఎత్తున బొగ్గు వెలికితీసే అవకాశం ఉండటంతో ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటోంది. దీంతో వాటి ద్వారా వచ్చే లాభాలతో భూగర్భ గనుల నష్టాలను కొంతవరకు పూడ్చుకుంటున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే నష్టాల్లో ఉన్న గనుల నిర్వహణను ఎండీవో విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రతిపాదన ఇప్పుడు కీలకంగా మారింది. శాంతిఖనితో మొదలయ్యే ఈ ప్రయోగం విజయవంతమైతే మరిన్ని భూగర్భ గనులకూ ఇదే విధానాన్ని విస్తరిస్తారా? అన్నది సింగరేణి కార్మికవర్గాల్లో ఆసక్తికర చర్చగా మారనుంది.

# ఢిల్లీకి చేరిన కొండా పంచాయితీ



- హైకమాండ్ నుంచి సురేఖకు పిలుపు..!
- కేసీ వేణుగోపాల్‌తో సురేఖ భేటీ చాన్స్!
- రాజకీయ ప్రకంపనలు రేపుతున్నపరిణామాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరోసారి రాజకీయ ఉత్కంఠ తీవ్ర స్థాయికి చేరుకుంది. మంత్రి కొండా సురేఖ కు.. ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు రావడం, ఆమె హస్తినకు బయల్దేరడం ఇప్పుడు పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి వచ్చిన పిలుపు నేపథ్యంలోనే ఆమె హస్తినకు వెళ్లినట్లు సమాచారం. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కొండా సురేఖ భేటీ కానున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం కూడా కొండా సురేఖ ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో కొండా సురేఖ విషయంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే చర్చ జోరందుకుంది. గత కొంతకాలంగా మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితలకు సంబంధించిన వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఇటీవలే గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తం కావడంతో పాటు.. పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా స్పందించింది. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే తన కుమార్తె వ్యాఖ్యలకు, తనకు ఎలాంటి సంబంధం లేదని.. అవి ఆమె వ్యక్తిగత వ్యాఖ్యలు అంటూ.. మంత్రి కొండా సురేఖ.. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి తన వివరణ అందించారు. ఆ తర్వాత కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారానికి సంబంధించి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను టీపీసీసీ అధిష్ఠానానికి పంపినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య ప్రస్తుతం కొండా సురేఖ ఢిల్లీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. హైకమాండ్ పెద్దలతో జరిగే సమావేశంలో తనపై వచ్చిన ఆరోపణలు, కుమార్తె వ్యాఖ్యల వ్యవహారం, పార్టీ అంతర్గత పరిణామాలపై కొండా సురేఖ వివరణ ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అయితే ఆమెపై ఎలాంటి చర్య తీసుకుంటారనే అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. కొండా సురేఖ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ వర్గాల్లో ప్రధానంగా రెండు రకాల చర్చలు వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం ఆమెకు కేవలం వివరణ కోరడంతో వ్యవహారాన్ని ముగిస్తుందా లేకపోతే.. పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశంగా పరిగణించి ఏదైనా చర్య తీసుకుంటుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ హైకమాండ్ నుంచి కఠిన నిర్ణయం వచ్చే పరిస్థితి ఉంటే మంత్రి పదవికి సురేఖ రాజీనామా చేసే అవకాశముందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లిన కొద్దిసేపటికే మంత్రి కొండా సురేఖ కూడా హస్తినకు చేరుకోవడంతో కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలపై చర్చలు జరుగుతున్నాయనే ప్రచారం ఊపందుకుంది. అయితే కేబినెట్‌లో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీ అంశం కూడా ఈ ఢిల్లీ పర్యటనలతో మరోసారి తెరపైకి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో పార్టీ పెద్దలను కలుస్తుండటంతో కేబినెట్ విస్తరణపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. కొత్త మంత్రుల ఎంపిక, ఖాళీ స్థానాల భర్తీ, పార్టీకి సంబంధించిన ఇతర అంశాలపై హైకమాండ్‌తో చర్చలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

# ప్రళయం అంతులేని శోకం

**ఇంకా వరదల్లో 275 మంది భారతీయులు**

**ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 1:** నేపాల్–టిబెట్ సరిహద్దుల్లో చెలరేగిన వినాశకర ప్రళయం అంతులేని శోకాన్ని మిగుల్చింది. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య వెయ్యి దాటగా.. 4,471 మంది ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. గల్లంతైన వారిలో కైలాస మానససరోవర యాత్రకు వెళ్లిన 275 మంది భారత పౌరులతో పాటు మరొక 128 మంది భారత సంతతి వ్యక్తులు ఉన్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. రోజురోజుకూ నదుల్లో మృతదేహాలు కొట్టుకొస్తుండటంతో నేపాల్ శవాగారాలన్నీ నిండిపోయి, మృతదేహాలను భద్రపరచడం, గుర్తించడం అధికారులకు అత్యంత సంక్లిష్టంగా మారింది. గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు నేపాల్ ప్రభుత్వం బాధితుల వివరాలతో పవర్ పాయింట్ స్లైడ్‌షోలను కూడా సిద్ధం చేసింది. ఈ విపత్కర పరిస్థితిలో మృతుల కుటుంబాలకు సహాయం అందించేందుకు ఖాఠ్మాండులోని భారత రాయబార కార్యాలయం ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. నేపాల్ ప్రభుత్వం వెబ్‌సైట్‌లో విడుదల చేస్తున్న ఫోటోలు, వివరాల ద్వారా మృతదేహాలను గుర్తించిన పక్షంలో.. భౌతికకాయాలను స్వదేశానికి తరలించేందుకు స్థానిక అధికారులతో సమన్వయం చేస్తామని ఎంబసీ తెలిపింది. దీనికోసం నేపాల్ ప్రభుత్వం రూపొందించిన 9 అంచెల నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా మృతదేహ అవశేషాల డాక్యుమెంటేషన్, లభ్యమైన ఫోటోలు, వివరాలను నమోదు చేయాలి. అలాగే పోస్టుమార్టం నిర్వహణ, మరణానికి గల కారణాల నిర్ధారణ, అధికారికంగా వ్యక్తి గుర్తింపు, వేలిముద్రలు, డీఎన్‌ఏ, ఫోరెన్సిక్ శాంపిళ్ల సేకరణ, మృతుడి పాస్‌పోర్ట్ లేదా ఐడీ వెరిఫికేషన్, ఎంబసీ లేదా కాన్సులర్ సమన్వయ ప్రక్రియ పూర్తి, హ్యాండోవర్ మెమో, రసీదుల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. మృతదేహాలు బాగా కుళ్లిపోయి, ఆకృతులు దెబ్బతినడంతో గుర్తింపు ప్రక్రియ కష్టసాధ్యంగా



మారింది. దీంతో నేపాల్ అధికారులు తాత్కాలిక పూడ్చివేతలను ప్రారంభించారు. ప్రతి శరీరానికి డీఎన్‌ఏ నమూనా తీసుకుని, ప్లాస్టిక్ బ్యాగ్‌లో ఉంచి ట్యాగ్, లోకేషన్ నంబర్‌ను కేటాయించి పూడ్చి పెడుతున్నారు. భవిష్యత్తులో డీఎన్‌ఏ మ్యాచ్ అయినప్పుడు కుటుంబ సభ్యులకు భౌతికకాయాల అవశేషాలను అప్పగించి తుది సంస్కారాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు.

# అదనపు సంచాలకుడిగా డీఎస్ జగన్

**సమాచార శాఖలో పదోన్నతి**

**బాధ్యతలు స్వీకరించిన జగన్**

**అభినందించిన మంత్రి పొంగులేటి**

**సమన్వయంతో పనిచేయాలని సూచన**

హైదరాబాద్, సెప్టెంబర్ 1: సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకుడిగా డీఎస్ జగన్ పదోన్నతి పొందారు. ఆయనకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సచివాలయంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయాలని సూచించారు. ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుందరెడ్డిని జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన కూడా జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శాఖ అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. అదనపు సంచాలకుడిగా బాధ్యతలు చేపట్టిన జగన్‌కు శాఖ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



# కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

- కవిత దొంగచాటుగా కాంగ్రెస్‌లో ప్రవేశించే యత్నం చేయలేదా
- ఎవరి స్వలాభం కోసం ఆమె విమర్శలు చేస్తున్నారో తెలుసు
- కష్టకాలంలో మేము మాత్రమే కేసీఆర్‌ను వెన్నంటి ఉన్నాం
- కవిత వ్యాఖ్యలపై మండిపడ్డ మాజీ మంత్రి వేముల



**నిజామాబాద్, సెప్టెంబర్ 1:** కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురిని కలిసి రాయబేరాలు నడిపిన కవిత తనను విమర్శించడం విడ్డూరంగా ఉందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్‌కు నమ్మకబంట్లుగా ఉన్న వారిని విడదీసి పార్టీని బలహీన పర్చాలన్న ఎజెండాతో కవిత పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. కవితను కేసీఆర్‌ను కలపడానికి ప్రయత్నం చేసిన, విడగొట్టడానికి ప్రయత్నం చేసిన విషయం కేసీఆర్‌కు బాగా తెలుసు. పార్టీ లైన్ దాటిన తర్వాత కేసీఆర్ కవితను పార్టీ నుంచి వేటు వేశారని అన్నారు. నేను, మా తండ్రి వేముల సురేందర్‌రెడ్డి టీఆర్‌ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులం. 2001 తెలంగాణ ఆవిర్భావానికి ముందే టీఆర్‌ఎస్ పార్టీలో ఉన్నాం. టీఆర్‌ఎస్ అంటేనే ప్రశాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి అంటేనే టీఆర్‌ఎస్ పార్టీ. కవిత మధ్యలో వచ్చిండ్రు.. మధ్యలో పోయిండ్రని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీతో నేను మంతనాలు చేశానని అంటున్న కవిత.. ఇప్పుడు కష్టకాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా.. కవితనా? అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది నేనా.. కవితనా? అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ఉన్న నేను కాంగ్రెస్‌లోని ఎవరితో మంతనాలు చేయలేదు. కవిత కాంగ్రెస్‌తో మంతనాలు చేయలేదని చెప్పగలరా? కవిత రహస్యంగా కాంగ్రెస్ నాయకులతో మంతనాలు చేయలేదని చెప్పగలరా? అని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు ఎవరి లాభం కోసం కవిత చేస్తున్నారు? స్వలాభం కోసం వ్యక్తిగత ప్రతిష్టలు దెబ్బతీసే విధంగా మాట్లాడడం కరెక్ట్ కాదు. నాపై నిరాధారమైన ఆరోపణలు చేసే హక్కు కవితకు లేదని అన్నారు. మొదటి నుంచి టీఆర్‌ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తున్నారు. కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తుంది. ప్రత్యక్షంగా మా నాయకత్వాన్ని బలహీనపరిచి, పరోక్షంగా అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తుందని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. కవిత సభలో కన్నీళ్లు పెట్టుకోవడంపై స్పందిస్తూ.. రాజకీయంగా సింపతిని గెయిన్ చేయడానికి అని అర్థం అవుతుంది. అది ఆమె విజ్ఞతకు వదిలేస్తున్నాం. కవిత చేసే ఈ పనుల వల్ల కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో బిడ్డగా ఆమె ఆలోచించడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్. ఆయనపైన, కేటీఆర్‌పైన విమర్శలు చేయగా లేనిది మాపై చేయడం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించలేదు. కానీ బాధగా అనిపించింది. సొంత లాభం కోసం కవిత మాట్లాడటం పెద్ద బాధగా అనిపించలేదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీగా చేయడంలో నా పాత్ర ఏందో కేసీఆర్‌కు బాగా తెలుసు. కవితపై మొన్నటి వరకు కేసీఆర్ బిడ్డగా గౌరవం ఉండేది. నిన్నటి మాటలతో ఆ గౌరవాన్ని కవిత పోగొట్టుకుందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లింబాద్రి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రయోజనాలను సూచించే 'బాకీ కార్డులకు' ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆ హామీలను అమలు చేస్తామని చెప్పిందని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో అనేక హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల ద్వారా ఎంత మేర బాకీ పడిందో ప్రజలకు తెలియజేస్తూ, ఇచ్చిన హామీలను ఇకనైనా నెరవేర్చాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు బీఆర్‌ఎస్ చేపట్టిన 'బాకీ కార్డుల పూజ' కార్యక్రమంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు తదితర వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజల ముందుంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సానుకూలత

- 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన
- నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన
- సాంకేతిక నివేదిక అనంతరం తదుపరి చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రామ్మోహన్ నాయుడి హామీ




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనకు సంబంధించి నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబర్ 7న తెలంగాణలో పర్యటించనుంది. న్యూఢిల్లీలో మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమైన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేవని తేలడంతో, తాజాగా నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లోని భౌగోళిక, వాతావరణ పరిస్థితులతోపాటు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని చెప్పారు. ÷ళింద్ర సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన అనంతరం కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణలోని మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత ఎర్రన్నాయుడు తన చిరకాల మిత్రుడని మంత్రి తుమ్మల గుర్తుచేసుకున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ఈ ప్రాంత ప్రాధాన్యాన్ని, జిల్లా ప్రజలకు విమానాశ్రయం అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ఎంపీ ల్యాడ్స్ నిధులపై దుష్ప్రచారం తగదు

**ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదు**

**ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ నివేదికపై బండి**



**కరీంనగర్, సెప్టెంబర్ 1:** ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై దుష్ప్రచారాలు తగవని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదికపై బండి స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించు కోవడంలో పార్లమెంట్ సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్న ఆ సంస్థ నివేదిక సత్యదూరమని బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి పనుల పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా.. అందులో ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని ఆయన స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతో సహా బండి సంజయ్ మీడియాకు వివరించారు. 'కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గత మూడేళ్లలో కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం స్థానిక ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 627 ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాం. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి 313, హన్మకొండ నుంచి 39, జగిత్యాల నుంచి 45, రాజన్న సిరిసిల్ల నుంచి 151, సిద్దిపేట నుంచి 79 పనులకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి. వీటిలో 82.29 శాతం పనులకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆమోదం తెలిపారు. మిగిలిన పనుల మంజూరు అంశం ప్రాసెస్‌లో ఉంది. మొత్తంగా కేంద్రం కేటాయించిన రూ.17.5 కోట్లలో 94.1 శాతం మేరకు అంటే రూ.16.47 కోట్ల నిధులకు సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని కేంద్ర మంత్రి వివరించారు. ఇందులో 16వ లోక్‌సభ సభ్యుడిగా కొనసాగిన బోయినపల్లి వినోద్ కుమార్ తన ఐదేళ్ల కాలంలో వినియోగించని రూ.2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు. వాస్తవానికి స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించి కేంద్రం ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులు సరిపోవడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా నిధులను ఏటా పెంచాలని కోరుతూ ఇప్పటికే ఎంపీల నుంచి కేంద్రానికి అనేక విజ్ఞప్తులు వెళ్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ ఎంపీ ల్యాడ్స్ నిధులే ఖర్చు చేయడం లేదంటూ ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ ప్రచారం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు అనేక దశలు ఉన్నాయని తెలిపారు. ఇవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా పార్లమెంట్ సభ్యులు ఎంపీ ల్యాడ్స్ నిధులనే వినియోగించుకోవడం లేదని ఆరోపణ చేయడమంటే బట్ట కాల్చి మీద వేయడమేనని మండిపడ్డారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 7 నెలల సమయం ఉన్నప్పటికీ తన వద్ద ఎంపీ ల్యాడ్స్ నిధులే మిగలలేదని, ఆ నిధులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ ఎప్పుడో సంబంధిత జిల్లాల కలెక్టర్లకు పంపామని వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు వచ్చే ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించేందుకు అవసరమైన నిధుల కోసం సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్‌ను కూడా సేకరిస్తున్నామనే విషయాన్ని ఆ సంస్థ గుర్తుంచుకోవాలన్నారు. ఇకనైనా ఎంపీ ల్యాడ్స్ నిధులకు సంబంధించి నగదు కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు దశలవారీగా వాస్తవాలను ఆ సంస్థ పరిగణనలోకి తీసుకుని, వాటిని ప్రజల ముందు ఉంచాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు.



# మిర్యాలగూడ బీఆర్‌ఎస్ రైతుర్యాలీకి అనుమతి నిరాకరణ

**ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్న పోలీసులు**

**గ్రౌండ్ లేదా, హాలు లాంటి చోట్ల అయితే అభ్యంతరం లేదని వెల్లడి**

**నల్లగొండ, సెప్టెంబర్ 1:** మిర్యాలగూడలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రైతు ర్యాలీ, బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలను కారణంగా చూపుతూ కేటీఆర్ ర్యాలీ, మీటింగ్‌కు అనుమతి ఇవ్వలేమని తిరస్కరించారు. ఈనెల 3న మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి రాజీవ్ చౌక్ వరకు రైతు ర్యాలీ నిర్వహించడంతో పాటు రాజీవ్ చౌక్‌లో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ర్యాలీలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ర్యాలీకి అనుమతి కోరుతూ బీఆర్‌ఎస్ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. వ్యవసాయ రంగం, సాగునీరు, విద్యుత్, యూరియా కొరత, రైతు భరోసా తదితర రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దరఖాస్తులో పేర్కొన్నారు. దీనిపై మిర్యాలగూడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అనుమతి నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రాజీవ్ చౌక్ ప్రధాన కూడలి కావడంతో భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, రైతులు తరలివస్తే అన్ని వైపుల నుంచి ట్రాఫిక్ నిలిచిపోయే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. రాజీవ్ చౌక్‌కు వచ్చే రహదారులు ఇరుకుగా ఉండటంతో పాటు ఈ ప్రాంతంలో రోజంతా భారీగా వాహనాల రాకపోకలు సాగుతుంటాయని తెలిపారు. అక్కడ ట్రాఫిక్‌ను మళ్లించేందుకు తగిన ప్రత్యామ్నాయ మార్గాలు కూడా లేవని, వాహనాల పార్కింగ్‌కు సరిపడా స్థలం అందుబాటులో లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోడ్లపై వాహనాలను నిలిపితే ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మరోవైపు కోదాడ-జడ్చర్లను కలిపే జాతీయ రహదారి-167 రాజీవ్ చౌక్ మీదుగా వెళ్తుందని పోలీసులు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తే జాతీయ రహదారిపై కూడా రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజీవ్ చౌక్ పరిసరాల్లో పలు ప్రభుత్వ, ఇతర ముఖ్య కార్యాలయాలు ఉన్నందున బహిరంగ సభ వల్ల వాటి సాధారణ కార్యకలాపాలకు ఇబ్బంది కలగవచ్చని పోలీసులు తెలిపారు. ర్యాలీ, సభకు అనుమతి ఇస్తే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొంటూ అనుమతిని తిరస్కరించారు. అయితే ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఇతర ప్రాంతాల్లో ఫంక్షన్ హాల్, గ్రౌండ్ వంటి ప్రదేశాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమం నిర్వహించు కునేందుకు అవకాశం కల్పిస్తామని పోలీసులు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# రాంచంద్రరావు హౌజ్ అరెస్ట్




**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :** భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తార్నాకలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. భాజపా నల్గొండ జిల్లా అధ్యక్షుడి నివాసానికి వెళ్లనున్నట్లు ప్రకటించడంతో ఆయన్ను గృహనిర్బంధం చేసినట్లు పోలీసులు తెలిపారు. నల్గొండ జిల్లాలో భాజపా, కాంగ్రెస్ శ్రేణుల మధ్య పరస్పరం దాడులు జరిగాయి. నల్గొండలో మంత్రి కోమటి రెడ్డి కార్యాలయంపై భాజపా కార్యకర్తలు కోడిగుడ్ల దాడి చేయగా.. భాజపా నల్గొండ జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేశారు. దీంతో పట్టణంలో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ క్రమంలో నల్లగొండ వెళ్లేందుకు రామచంద్రరావు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటనపై బిజెపి శ్రేణులు మండిపడ్డాయి. అలాగే కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఢిల్లీ మార్చ్‌ను ఉపసంహరణ

**ప్రభుత్వ హామీతో సీజేపీ నిర్ణయం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు నిర్వహించ తలపెట్టిన నిరసన యాత్రను విరమించుకుంటున్నట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సానుకూల హామీలు ఇచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మంగళవారం సర్వోన్నత న్యాయస్థానానికి వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, నీట్ వివాదం కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల కాలపరిమితిలోగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, జులై 20 నుంచి 25 మధ్య కాలంలో నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను తదుపరి విచారణకు తీసుకెళ్లబోమని, కొత్త కేసులు నమోదు చేయబోమని స్పష్టం చేశారు. గతంలో సీజేపీకి ఇచ్చిన హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన కోర్టుకు విన్నవించారు. ప్రభుత్వ హామీలపై సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ స్పందిస్తూ, "కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సానుకూల హామీలకు, వాటికి లభించిన న్యాయపరమైన భరోసాకు అనుగుణంగా సెప్టెంబర్ 5న తలపెట్టిన మార్చ్‌ను ఉపసంహరించుకోవడమే సముచితమని భావిస్తున్నాం. న్యాయస్థానం జారీ చేసిన తాజా ఉత్తర్వులకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. నీట్-యూజీ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో నిరసనకారులపై నమోదైన కేసులను ఎత్తివేస్తామని జులై 25న ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ సీజేపీ ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. కాగా, సీజేపీ తాజాగా తీసుకున్న నిరసన రద్దు నిర్ణయాన్ని జస్టిస్ సూర్యకాంత్ 'మంచి పరిణామం'గా అభివర్ణిస్తూ ప్రశంసించారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
బుధవారం
2 సెప్టెంబర్ 2026



# భారత్‌కు మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ

## రష్యాతో డీల్ కుదుర్చుకోనున్న భారత్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** 'ఆపరేషన్ సిందూర్'లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలకు భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వీటి అవసరాలు పెంచుకోవాలని భారత రక్షణశాఖ నిర్ణయించినట్లు సమాచారం. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్-400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీచేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు 5 కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించి నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్-400.. గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో అదరగొట్టింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను విజయవంతంగా అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. ఎస్-400 పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ. దూరంలో ఎస్-400 కూల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంత దూరంలో భూమి నుంచి ప్రయోగించిన గగనతల రక్షణ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించడం అత్యంత అరుదని నాడు రక్షణ రంగంలో చర్చ కూడా జరిగింది. ఎస్-400 అనేది ఒకే మిసైల్ కాదు. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు, వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ. వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది. దీంతో శత్రు విమానాలు భారత గగనతలానికి చేరకముందే వాటిని గుర్తించి ఎదుర్కోగలవు. ఈ కారణంగానే భారత్ తన బహుళస్థాయి వైమానిక రక్షణ వ్యవస్థలో ఎస్-400కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2018లో కుదిరిన తొలి ఒప్పందం ప్రకారం.. భారత్ మొత్తం 5 ఎస్-400 యూనిట్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటివరకు 4 యూనిట్లు భారత్‌కు అందాయి. ఇంకో యూనిట్ నవంబర్ నాటికి అందే అవకాశముంది. తాజాగా మరో 5 యూనిట్ల కోసం భారత్ ఆసక్తి చూపుతోందని సమాచారం.

# సికింద్రాబాద్ మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ

## కట్టుదిట్టమైన భద్రత ఉన్నా రైఫిళ్లు మాయమైనట్లు సమాచారం

## దర్యాప్తునకు రంగంలోకి దిగిన బొల్లారం పోలీసులు

**హైదరాబాద్,సెప్టెంబర్1:** సికింద్రాబాద్‌లోని మద్రాస్ రెజిమెంట్ ప్రాంతంలో అత్యాధునిక ఆయుధాలు మాయమవడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఆర్మీ కాంపౌండ్‌లోకి చొరబడిన దుండగులు ఆయుధాలు భద్రపరిచే గదికి సంబంధించిన తాళాన్ని పగలగొట్టి 12 ఆయుధాలను అపహరించినట్లు సమాచారం. ఈ ఘటనపై ఆర్మీ అధికారులు బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. చోరీకి గురైన ఆయుధాల్లో నాలుగు ఏకే-47 రైఫిళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్, ఆరు పిస్టళ్లు ఉన్నాయి. వీటితో పాటు పెద్ద మొత్తంలో మందుగుండు సామగ్రి కూడా మాయమైనట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే రక్షణ వ్యవహారాలకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో పోలీసులు ఆయుధాల చోరీకి సంబంధించిన పూర్తి వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. మద్రాస్ రెజిమెంట్ ప్రాంతం చుట్టూ ఎత్తైన ప్రహరీతో పాటు మూడంచెల భద్రతా వ్యవస్థ కొనసాగుతోంది. రెజిమెంట్ ప్రాంతంలోకి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా అనుమతి తప్పనిసరి. ఆయుధాలు, మందుగుండు సామగ్రి భద్రపరిచే స్టోర్స్ చుట్టూ ప్రత్యేక భద్రత ఉంటుంది. అంతేకాకుండా అత్యాధునిక సీసీ కెమెరాలతో నిత్యం నిఘా కొనసాగుతుంది. ఇంతటి కట్టుదిట్టమైన భద్రత ఉన్న ప్రాంతంలోకి దుండగులు ఎలా ప్రవేశించారు.? ఆయుధాలు భద్రపరిచిన గది వరకు ఎలా చేరుకున్నారు.? తాళాన్ని ఎలా పగలగొట్టారు.? అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు రెజిమెంట్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రెజిమెంట్‌లోకి ఇటీవల ఎవరెవరు వచ్చారు.? ఎవరు బయటకు వెళ్లారు.? అనుమతులు ఎవరికి ఉన్నాయి.? అనే వివరాలను సేకరిస్తున్నారు. అలాగే అనుమానితులను కూడా పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఆయుధాల స్టోర్స్‌లో పనిచేసే సిబ్బంది, భద్రతా విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలను కూడా క్షుణంగా పరిశీలిస్తున్నారు. చోరీకి గురైన ఆయుధాలు, మందుగుండు సామగ్రి పరిమాణం దృష్ట్యా ఈ ఘటనలో ఒకరి కంటే ఎక్కువ మంది వ్యక్తులు పాల్గొని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నాలుగు ఏకే-47 రైఫిళ్లు, ఇన్సాస్ రైఫిల్, పిస్టళ్లు, మందుగుండు సామగ్రిని తీసుకెళ్లడానికి ఒకరి కంటే ఎక్కువ మంది వచ్చింటారని భావిస్తున్నారు. ఈ కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు ఆయుధాలు నిజంగా చోరీకి గురయ్యాయా? లేక ఎక్కడైనా ఇతర ప్రాంతంలో ఉంచి, రికార్డుల్లో నమోదు కాకపోవడం వల్ల మిస్సింగ్‌గా గుర్తించారా..? అనే కోణంలోనూ అధికారులు పరిశీలిస్తున్నారు. ఆయుధాల స్టాక్, రికార్డులు, గతంలో జరిగిన ఆడిట్ వివరాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.




# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

- బంగారాన్ని అనవసరంగా కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
- దేశప్రజల సమిష్టి కృషితోనే జీడీపీ వృద్ధిరేటు
- దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తి సామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకు పోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్య్రం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

# తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?

## తెరపైకి రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు

## ఇప్పుడే అలాంటి చర్చ అవసరం లేదన్న ట్రంప్




**వాషింగ్టన్, సెప్టెంబర్ 1 :** అమెరికా తదుపరి అధ్యక్షుడిగా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు తెరపైకి వస్తున్న వేళ డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2028 ప్రెసిడెంట్ ఎలక్షన్స్‌లో పోటీచేసే అవకాశాలపై మాట్లాడిన అగ్రరాజ్య అధ్యక్షుడు.. ఆ విషయమై ఇప్పుడే చర్చ అక్కర్లేదని సమాధానాన్ని దాటవేశారు. 'హెగ్సెత్ అద్భుతంగా పని చేస్తున్నారు. అయితే ఇలాంటి విషయాల గురించి మాట్లాడేందుకు ఇది తొందరపాటు చర్య అవుతుంది. ముందుగా నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికలను పూర్తి చేయాలి' అని ట్రంప్ అన్నారు. యూఎస్ ప్రెసిడెంట్‌గా రెండు పర్యాయాలు మాత్రమే కొనసాగే అవకాశమున్న ట్రంప్.. 2029లో ఆ పదవి నుంచి తప్పుకోనున్నారు. దీంతో ఆయన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ఉద్యమాన్ని ముందుకు నడిపించే తదుపరి నేత ఎవరన్న దానిపై రిపబ్లికన్ పార్టీలో చర్చ జోరందుకుంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్లు ఇప్పటికే వినిపిస్తున్నా.. తాజాగా ఆ లిస్ట్‌లో హెగ్సెత్ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ఐయోవా స్టేట్ ఫెయిర్‌లో రిపబ్లికన్ల తరఫున హెగ్సెత్ ప్రచారం చేయడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చినట్లైంది. అయితే ఈ వార్తలను హెగ్సెత్ ఖండించారు. అవి '100 శాతం అవాస్తవం' అని సోషల్ మీడియాలో పేర్కొన్నారాయన. హెగ్సెత్ గతంలో ఆర్మీ నేషనల్ గార్డ్‌లో పనిచేశారు. అనంతరం ఫాక్స్ న్యూస్ ఛానల్‌లో టీవీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన రాజకీయ భవితవ్యంపై ట్రంప్ మరింత ఆసక్తికరంగా స్పందించారు. 'ప్రస్తుతం ఆయనకు సైన్యం, సైనికుల సంక్షేమం తప్ప మరేదీ ముఖ్యం కాదు' అని వ్యాఖ్యానించారు. మరోవైపు 2028 అధ్యక్ష ఎన్నికల కోసం పలువురు నేతలు ఇప్పటికే అంతర్గతంగా సన్నాహాలు ప్రారంభించి ఉండొచ్చని ట్రంప్ చెప్పారు. ఏది ఏమైనా ట్రంప్ వారసుడిగా అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించనప్పటికీ.. జేడీ వాన్స్, మార్కో రూబియో, హెగ్సెత్ వంటి పేర్లు వినిపిస్తుండటం రిపబ్లికన్ పార్టీలో 2028 పోరుపై ఆసక్తి రేపుతోంది.

# రష్యా సైన్యంలో 51మంది భారతీయులు మృతి

## విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** రష్యా సైన్యంలోని 51 మంది భారతీయులు మరణించారని విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడించారు. మొత్తం 227 మంది రష్యాలో సైన్యంలో చేరగా ఇప్పటివరకూ 139 మంది బయటకు వచ్చేశారని అన్నారు. మిగిలిన వారినీ వెనక్కు తీసుకొచ్చేందుకు రష్యాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కిర్గిస్థాన్ పర్యటన నేపథ్యంలో సోమవారం మీడియా అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ సెక్రటరీ ఈ వివరాలను వెల్లడించారు. ఈ అంశంలో రష్యాతో వివిధ స్థాయిల్లో చర్చలు జరుగుతున్నాయని మిశ్రీ చెప్పారు. మాస్కోలోని భారతీయ ఎంబసీ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ భారతీయులను వెనక్కు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. భారతీయులు త్వరగా సైన్యం నుంచి డిశ్చార్జ్ అయ్యేలా రష్యా చర్యలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. రష్యా-భారత్ వాణిజ్యం గురించి కూడా మిశ్రీ మాట్లాడారు. గతేడాది భారత్‌లో రష్యన్ దిగుమతిదారుల సమావేశంలో అక్కడి సంస్థలు ఉత్సాహంగా పాల్గొన్నాయని చెప్పారు. భారత్ నుంచి దిగుమతులను పెంచేందుకు ఉత్సుకత ప్రదర్శించాయని చెప్పారు. తదుపరి రష్యాలో జరుగునున్న సమావేశంలో భారతీయ ఎగుమతిదారుల ఫోరం సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ సానుకూలంగా స్పందించారని అన్నారు. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఇటీవల కిర్గ్ రిపబ్లిక్ దేశ పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కూడా సమావేశం అయ్యారు. యుద్ధాలకు శాశ్వత ముగింపు పలికేందుకు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# విమానంలో సాంకేతిక లోపం

## అత్యవసరంగా గోవాలోనే ల్యాండింగ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** గోవా నుంచి ఢిల్లీ బయలుదేరిన ఇండిగో విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. మంగళవారం ఉదయం 9.15 గంటలకు గోవా ఎయిర్ పోర్ట్ నుంచి విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ సాంకేతిక లోపం ఏర్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన విమానం పైలట్ వెంటనే మనోహర్ ఎయిర్ పోర్ట్ అధికారులకు తెలియజేశారు. వారి అనుమతితో ఈ విమానాన్ని అత్యవసరంగా గోవా ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేశారు. దీంతో విమానంలోని ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్ నేపథ్యంతో గోవా ఎయిర్‌పోర్టులో అధికారులు ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. ఈ విమానంలోని ప్రయాణికులను ఢిల్లీ తరలించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో యాజమాన్యం ఈ సందర్భంగా వెల్లడించింది. అందుకోసం మరో విమానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో తెలిపింది. విమానం టేకాఫ్ అయిన ఐదు నిమిషాలకే ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్లు కనుగొన్నారని వివరించింది. విమానంలో ఏర్పడిన సమస్యను గుర్తించే పనిలో సాంకేతిక సిబ్బంది ఉన్నారని పేర్కొంది. ప్రయాణికులతోపాటు విమాన సిబ్బందికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని ఇండిగో సంస్థ తెలిపింది.

# జీడీపీ వృద్ధిరేటు గణాంకాల గారడీ

## ధరలు మోత మోగిస్తుంటే..వృద్ధి ఎలా సాధ్యం

## ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరామ్ రమేశ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** భారత దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై రాజ్యసభ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణంకాల గారడీతో మోదీ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ముంచెత్తు తోందని ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజ్' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని ఆరోపించారు. ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం కేవలం వంటింటికే పరిమితం కాలేదని అన్నారు. రాగి వైర్ ధర రూ.850 నుంచి రూ.1,700కి, అల్యూమినియం ధర రూ.350 నుంచి రూ.650 కి చేరిందని వెల్లడించారు. 1,000 చదరపు అడుగుల ఇంటికి వైరింగ్ ఖర్చు రూ.50 వేల నుంచి లక్ష రూపాయిలకు పెరిగిందని చెప్పారు. హోమ్ అప్లయన్సెస్, ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్లు, సోలార్ ప్యానెళ్ల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయని అన్నారు. స్విచ్ సాకెట్లు, మెయిన్ లైన్ కేబుల్స్, టైల్స్, కార్మికులు ఖర్చు ఇలా అన్ని పెరిగాయని అన్నారు. ధరాభారం అన్ని వైపుల నుంచి ప్రజలకు షాకులిస్తోందని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కూడా మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవాలను మరుగున పరిచి, గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ఉందని మండిపడ్డారు. త్రైమాసిక జీడీపీ గణాంకాలు దేశంలోని పరిస్థితుల్ని తప్పుగా చూపిస్తున్నాయని అన్నారు. వీక్ సెంటిమెంట్‌ను ప్రతిఫలించట్లేదని చెప్పారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భారత్ ప్రగతిబాటలో దూసుకుపోతుంటే నిరాశావాదులు మాత్రం అసత్యాలను ప్రతిధ్వనిస్తున్నారని విమర్శించారు. ఈ వృద్ధి రేటు భారతీయుల సమష్టి శక్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఈ వృద్ధి రేటుకు కొనసాగించేందుకు భారతీయులు దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించారు.



# పాము కాటుతో వృద్ధురాలి మృతి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా పెనుబల్లిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో పనులు చేసుకుంటున్న సమయంలో నాగుపాము కాటువేయడంతో ఓ వృద్ధురాలు మృతిచెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. పెనుబల్లికి చెందిన భారతమ్మ(60) ఇంట్లో తన పనులు చేసుకుంటుండగా పాము కాటువేసింది. భారతమ్మ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చికిత్స నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమెకు చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించాలని సూచించారు. దీంతో భారతమ్మను ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పాముల సంచారం ఎక్కువగా ఉండే నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఇళ్ల పరిసర ప్రాంతాల్లో పొదలు, చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రాత్రి వేళల్లో బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

## విద్యార్థులకు నోట్బుక్స్, బ్యాగులు, యూనిఫామ్స్ పంపిణీ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ అన్నారు. ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని బండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు నోట్బుక్స్, బ్యాగులు, యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్బుక్స్, బ్యాగులు, యూనిఫామ్స్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయాన్ని అందించడం అభినందనీయమని కొనియాడారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి అండగా నిలవడం ద్వారా విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహనా కమల్ పాషా, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# లింబూర్ ప్రభుత్వ పాఠశాల తనిఖీ



**ఉద్యమ కెరటం, డోంగ్లీ:** మండలంలోని లింబూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను డోంగ్లీ స్పెషల్ ఆఫీసర్ సౌజన్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకం, మరుగుదొడ్ల నిర్వహణ, తరగతి గదుల పరిశుభ్రత, మౌలిక వసతులను పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి వారి అభ్యాసన తీరుపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలో ఇంటింటి సర్వేలో భాగంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది సాయిబాబా, లింబూర్ సెక్రెటరీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



**ఉద్యమ కెరటం, తాండూర్:** సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో పెన్షన్ విద్రోహ దినాన్ని పాటిస్తూ మంగళవారం జడ్పీహెచ్ఎస్ తాండూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని చేపట్టారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తపస్ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో తెలియజేసిన విధంగా సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రగతిలో సరికొత్త మైలురాయి

- రేవంత్ రెడ్డి ప్రజా పాలనకు వెయ్యి రోజులు
- బోథ్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆడే గజేందర్



**ఉద్యమ కెరటం,బోథ్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం నేటితో విజయవంతంగా వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుని ప్రజా ప్రస్థానంలో సరికొత్త మైలురాయిని అధిగమించిందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. గత పదేళ్ల విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తం చేసి, రేవంత్ రెడ్డి ప్రభుత్వం గడిచిన వెయ్యి రోజుల్లోనే రాబోయే వందేళ్ల ప్రగతికి బలమైన పునాది వేసిందని కొనియాడారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రుల సమష్టి కృషితో రాష్ట్రం సంక్షేమం, సంపద సృష్టిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. కేవలం వెయ్యి రోజుల్లోనే రాష్ట్ర తలసరి ఆదాయం రూ.(ఒక వ్యక్తి తలసరి ఆదాయం) 4,18,931కి చేరిందని, ఇది జాతీయ (దేశ సగటు 2.19 లక్షల కంటే) 91 శాతం అధికమని, ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి విజయం అని తెలిపారు. ఎన్నికల హామీ మేరకు రేవంత్ సర్కార్ రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీని ఏకకాలంలో విజయవంతంగా అమలు చేసిందని అన్నారు. దాదాపు రూ.1.70లక్షల కోట్లు రైతు భరోసా, రుణ మాఫీ, ఉచిత విద్యుత్తు, ధాన్యం కొనుగోలు, ఇతర సంక్షేమ పథకాలకు ఖర్చు చేయడం రైతన్నల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు నిరుద్యోగులను మోసం చేస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల్లోనే 72,000 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు అండగా నిలిచిందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు వ్యాపార రంగంలో పెద్దపీట వేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 3.48 కోట్ల మంది లబ్ధిదారులకు 6 కిలోల సన్నబియ్యాన్ని అందిస్తూ పేద ప్రజల ఆకలి తీరుస్తున్నామని, అలాగే నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడానికి రాష్ట్ర వ్యాప్తంగా రెండు విడతల్లో కలిపి 7లక్షల ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్ అని, వివిధ నిర్మాణ దశల్లో లక్షల ఇళ్ళు ఉన్నాయని చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ విధ్వంస పాలనకు, కాంగ్రెస్ వెయ్యి రోజుల సుపరిపాలనకు మధ్య గల తేడాపై అసెంబ్లీలో చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్కు విపక్షాలు సమాధానం చెప్పలేకపోతున్నాయని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** సీపీఎస్ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని మండల ఉద్యోగ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్యత్తును అభద్రతాభావంలోకి నెట్టే సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా సేవలు అందించిన ఉద్యోగులకు వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో డిటి విశ్వనాథ్ కు డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నూర్ సింగ్, ఎంపిఓ జీవన్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్యామ్ సుందర్ రెడ్డి, అరుణ్ కుమార్ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు

## ఎస్సై వెంకటకృష్ణ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సరైన నంబర్ ప్లేట్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ హెచ్చరించారు. మంగళవారం తల్లాడ పట్టణంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నంబర్ ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. చైన్ స్నాచింగ్ తదితర నేరాలకు పాల్పడి తప్పించుకునే క్రమంలో కొందరు నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు, వైరా ఏసీపీ సారంగపాణి పర్యవేక్షణలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. నంబర్ ప్లేట్ లేని వాహనదారులకు జరిమానాలు విధించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం నిబంధనలకు అనుగుణంగా నంబర్ ప్లేట్లు అమర్చుకున్న వాహనదారులకు వెసులుబాటు కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పెండింగ్ చలాన్లు చెల్లించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు.

# యూరియా పంపిణీలో అవకతవకలు

- భరినిపాడు సొసైటీ ఎదుట రైతుల ధర్నా



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సొసైటీ పరిధిలో యూరియా పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని రైతులు పేర్కొన్నారు. మంగళవారం వేంసూరు మండల పరిధిలోని భరినిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. యూరియా కోసం సొసైటీ వద్దకు వస్తున్న రైతులకు పలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా పంపిణీకి సంబంధించిన ఫోన్ యాప్ సక్రమంగా పనిచేయకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని తెలిపారు. యాప్ పనిచేయకపోవడంతో యూరియా పొందేందుకు నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. యూరియా పంపిణీ ప్రక్రియలో పారదర్శకత లోపిస్తోందని, కొంతమంది రైతులకు మాత్రమే యూరియా అందుతున్నట్లు పరిస్థితి కనిపిస్తోందని ఆరోపించారు. సాగు సమయంలో యూరియా కొరత ఏర్పడటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ప్రభుత్వం, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి యూరియా పంపిణీపై సమగ్రంగా పరిశీలన జరపాలని డిమాండ్ చేశారు. యాప్ సమస్యలను వెంటనే పరిష్కరించి, సొసైటీ పరిధిలో అర్హులైన రైతులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉంచడంతో పాటు పంపిణీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని, అవకతవకలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

# హియరింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా అనమలిస్ జాబితా, మ్యాపింగ్ కాని ఓటర్లకు అందజేసిన నోటీసుల హియరింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో చేపడుతున్న హియరింగ్ ప్రక్రియ, నోటీసులు, రిజిస్టర్లు, ఓటర్లు అందిస్తున్న ధృవ పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో గల ఓటర్లకు నిర్ణీత గడువులోగా నోటీసులు అందజేసి హియరింగ్ ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. సంబంధిత నోటీసులు అందుకున్న ఓటర్ల నుండి అవసరమైన ధ్రువ పత్రాలను స్వీకరించి బూత్ స్థాయి అధికారి యాప్ లో నమోదు చేయాలని, బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి నోటీసులు అందజేసి ఓటర్ల నుండి రసీదులు తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకూడదని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రియాజ్ అలీ, రెవెన్యూ సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** డైరీ ఫార్మింగ్తో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని, యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ అన్నారు. మంగళవారం గంభీరావుపేట మండల కేంద్రంలోని కోమటిరెడ్డి విజేందర్ రెడ్డి పాడి డెయిరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకుంటూ యువత ఉపాధి పొందాలని సూచించారు. ఈ సందర్భంగా పాడి డైరీ నిర్వహణ, పశువుల సంరక్షణ, పాల ఉత్పత్తి తదితర అంశాలను పరిశీలించారు. పీఎం ఈజీపీ పథకం ద్వారా కేడీసీసీ బ్యాంకు నుంచి రుణం పొంది పాడి డెయిరీ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు, మరికొందరికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లింగన్నగారి దయాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 420 మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట



**ఉద్యమ కెరటం, తాండూర్:** కాంగ్రెస్ 420 మోసాలపై బీఆర్ఎస్ పార్టీ పోరుబాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మంగళవారం తాండూర్ లోని బీఆర్ఎస్ నాయకులు ఎలుక రామచందర్ ఇంటి వద్ద మంగళవారం పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అమలుకాని 6 గ్యారెంటీలు, 420 హామీలను వంద రోజుల్లోనే అమలు చేస్తామని నమ్మించి మోసపూరితంగా గద్దెనెక్కిన రేవంత్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడిచినప్పటికీ నేటివరకూ వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా వంచించిందని, బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ 420 మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఈనెల 2 నుంచి 8 వరకు నియోజకవర్గంలో చేయాల్సిన నిరసన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు బెల్లంపల్లి నియోజకవర్గకేంద్రంలో ధర్నా, బాకీ కార్డులు పంచడం, 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి, పురుషోత్తం గౌడ్, మంగపతి సురేష్ బాబు, పూసల ప్రణయ్ కుమార్, బోనగిరి చంద్రశేఖర్, మసాడి శ్రీరాములు, బోడ సతీష్, గట్టు సంతోష్ కుమార్, మొగిలి శంకర్, జాడిపోషం, పెరక రాజన్న, అర్జున్, బాబు ఖాన్, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** దేశంలోనూ, రాష్ట్రంలోనూ మహిళలపై రోజురోజుకూ పెరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలను అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ప్రజా సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శిరీష పై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను తక్షణమే అరెస్టు చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గోడిసెల కార్తీక్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి నంది పద్మలు మాట్లాడారు. మహిళలకు రక్షణగా ఎన్ని చట్టాలు తీసుకొచ్చినప్పటికీ వారిపై జరుగుతున్న దారుణాలు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శిరీష ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రాజేందర్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, కోశాధికారి నిఖిల్, వివిధ ఆస్పత్రుల నర్సులు తనుశ్రీ, హిందూ, మేఘన, రజిత, బుజ్జి, శ్రావణి, సౌందర్య, పావని, రతిక, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# మద్నూర్ తహశీల్దార్ కార్యాలయం ముందు ఉద్యోగుల నిరసన



**ఉద్యమ కెరటం, మద్నూర్:** సీపీఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు మంగళవారం మద్నూర్ మండల తహశీల్దార్ కార్యాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. పెండింగ్లో ఉన్న పిఆర్సీని వెంటనే ప్రకటనను అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న డీఏలను విడుదల చేసి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని పేర్కొన్నారు. భోజన విరామ సమయంలో కార్యాలయం ముందు చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ రవికుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్యత్తుకు భద్రత కల్పించే ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు. 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన వారందరికీ పెన్షన్ భరోసా లేకుండా చేసిన సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. అదేవిధంగా 11వ పిఆర్సీ ప్రకటనను వెంటనే అమలు చేయడంతో పాటు, ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డిఏ బకాయిలను కూడా వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తున్నా, వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మండల నాయబ్ తహశీల్దార్లు ఖాలిద్, శివరామకృష్ణ, గిర్దావర్ మురళీధర్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది బాలరాజు, కావేరి, ప్రవీణ్, దశరథ్, జీపీఓల మండల అధ్యక్షుడు సత్యం సంతోష్, బాబు, సురేష్, నర్సింలు, రంజిత్, సంగమ్మ, మరియు మండల రెవెన్యూ ఉద్యోగుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.


# ఘనంగా తుల అరుణ్ కుమార్ జన్మదిన వేడుకలు



**ఉద్యమ కెరటం, సొనాల:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంటిలెక్చువల్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ తుల అరుణ్ కుమార్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ అరుణ్ కుమార్ తన తండ్రి స్వర్గీయ తుల సుభాష్ జ్ఞాపకార్థం తుల సుభాష్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఆదిలాబాద్ జిల్లా గిరిజన ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యంపై అవగాహన సదస్సులు, ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి పేదలకు అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి కార్యదర్శులు లోలపు పోశెట్టి, చౌహాన్ హరి సింగ్, సర్పంచుల సంఘం అధ్యక్షులు చౌహాన్ వినోద్ సింగ్, డిసిసి ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి భీంరావు పాటిల్, సర్పంచ్ గైక్వాడ్ శ్రీరామ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సోమన్న మునేశ్వర్, ఉప సర్పంచ్ అరవింద్, నాయకులు బలిరాం, సుదర్శన్, మాధవ్ రావు పటేల్, లాలూరామ్ తదితరులు పాల్గొన్నారు.

# గంభీరావుపేటలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలి

- దూర ప్రాంతాలకు వెళ్లలేక రోగుల అవస్థలు
- ప్రభుత్వాన్ని వేడుకుంటున్న బాధితులు





**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డయాలసిస్ రోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రస్తుతం మండల కేంద్రానికి చెందిన సుమారు ఆరుగురు రోగులు వారానికి మూడు రోజుల పాటు డయాలసిస్ చేయించుకునేందుకు కామారెడ్డి, సిరిసిల్ల వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డయాలసిస్ కోసం బస్సులు, ఆటోలు వంటి రవాణా సౌకర్యాలను ఆశ్రయించి తరచూ దూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రయాణాల కారణంగా సమయం, డబ్బు ఖర్చవడంతో పాటు అనారోగ్యంతో ఉన్న తమకు శారీరకంగా కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. తమతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో కూడా మరికొందరు రోగులు ఉన్నారని తెలిపారు. గంభీరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తే మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రోగులు, వారి కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దాసరి రమేష్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను, నిమజ్జన వేడుకలను కులమతాలకు అతీతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడం మన సాంప్రదాయమని భీంపూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దాసరి రమేష్ అన్నారు. ఆదిలాబాద్లోని తనీషా గార్డెన్లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన నిర్వహణపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భీంపూర్ మండల ప్రతినిధిగా దాసరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించిన నిబంధనలను భీంపూర్ మండల ప్రజలందరూ తప్పక పాటించాలని పిలుపునిచ్చారు. కులమతాల బేధం లేకుండా అందరూ కలిసికట్టుగా, ఎంతో కాలంగా వస్తున్న సాంప్రదాయాన్ని కాపాడుతూ ఈ ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. ఎలాంటి అల్లర్లకు తావులేకుండా, ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జన వేడుకలను విజయవంతం చేయడానికి భీంపూర్ మండల సర్పంచుల ఫోరం, ప్రజలు పూర్తి స్థాయిలో సహకరిస్తారని స్పష్టం చేశారు.

# అధిక మోతాదులో యూరియా వాడితే పంటలకు నష్టం

## మండల వ్యవసాయ అధికారి సలాఉద్దీన్



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** పంట అవసరానికి అనుగుణంగా యూరియాను సమతుల్యంగా వినియోగించాలని, అధిక మోతాదులో వాడితే పంటకు నష్టం కలిగే అవకాశం ఉందని గంభీరావుపేట మండల వ్యవసాయ అధికారి సలాఉద్దీన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో రైతుల వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సన్న రకం వరి పంట సాగు చేస్తున్న రైతులతో మాట్లాడి పంట ప్రస్తుత పరిస్థితిని తెలుసుకున్నారు. వరి పంటకు అవసరమైన యూరియా మోతాదు, ఎప్పుడు ఎంత పరిమాణంలో వేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే సన్న రకం వరి పంటలో ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, చీడపీడల నివారణ తదితర అంశాలపై రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు చేసేంత వరకు పోరాటం



**ఉద్యమ కెరటం, కౌటాల:** నూతన పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు నిరసన చేపట్టారు. టీజీఈజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా మంగళవారం కౌటాల మండల కేంద్రంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనంతరం ఆర్థిక భద్రత లేకుండా పోతుందని, తక్షణమే సీపీఎస్ను రద్దు చేసి ఓపీఎస్ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ ప్రమోద్కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల జేఏసీ నాయకులు సోయాం ఇందు రావు, దుర్గం దేవేందర్, ఉపాధ్యాయులు రావుల వినోద్, గుణాకర్ చౌదరి, రవికుమార్, విఠల్, రాకేష్, అశోక్, సంతోష్, గంగా సింగ్, కృష్ణ, తిరుపతి, విలాస్, చంద్రమౌళి, కౌడు, సునీల్, సుధాకర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఆకుల వెంకటేష్



**ఉద్యమ కెరటం, తాండూర్:** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడిగా ఆకుల వెంకటేష్ ఎన్నికయ్యారు. మంచిర్యల జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన సర్పంచుల సమావేశంలో తాండూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. తాండూర్ మండలంలోని వివిధ గ్రామ పచాయతీల సర్పంచులు హాజరైన ఈ సమావేశంలో జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య సమక్షంలో మండల సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడిగా కొత్తపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఆకుల వెంకటేష్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా అధ్యక్షుడు మాట్లాడుతూ తనపై నమ్మకాన్ని ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్న తాండూర్ మండల సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, తాండూర్ మండలంలోని వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలి



**ఉద్యమ కెరటం, తాంసి:** అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం తాంసి మండలంలోని కప్పర్ల గ్రామంలో సర్పంచ్ గండ్రత్ అరుణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్-2 ప్రత్యేక కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కౌడాల సంతోష్లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు వచ్చిన వారు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా గడువులోగా సంబంధిత పత్రాలతో అధికారులకు వివరణ ఇవ్వాలని కోరారు. అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఓటరు జాబితాలో వివరాలను సరిచూసుకోవాలని, ఏవైనా తప్పులు ఉంటే బీఎల్ఓలను సంప్రదించి సవరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భూభారతి ఎఫ్టీఎస్ సిబ్బందికి న్యాయం చేస్తాం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** భూభారతి ప్రాజెక్టులో పనిచేస్తున్న ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ (ఎఫ్టీఎస్) సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని మాజీ జడ్పీటీసీ గోక గణేష్రెడ్డి హామీ ఇచ్చారు. తమ సేవలను 2026–27 ఆర్థిక సంవత్సరానికి పునరుద్ధరించాలని, గతంలో కొనసాగిన 636 మంది సిబ్బంది బలాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరుతూ ఎఫ్టీఎస్ సిబ్బంది మంగళవారం ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గోక గణేష్రెడ్డి మాట్లాడుతూ గతంలో రెవెన్యూ శాఖ పరిధిలో, ప్రస్తుతం తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ (టీజీటీఎస్) ఆధ్వర్యంలో ఎఫ్టీఎస్ సిబ్బంది నిరంతరాయంగా సాంకేతిక సేవలు అందిస్తున్నారని తెలిపారు. భూభారతి ప్రాజెక్టు అమలులో సిబ్బంది సేవలు కీలకంగా ఉన్నాయని పేర్కొన్నారు. సిబ్బంది భవిష్యత్తు, వారి కుటుంబాల జీవనోపాధితో ముడిపడి ఉన్న ఈ అంశాన్ని ప్రభుత్వం పెద్దల దృష్టికి వెంటనే తీసుకెళ్తానని చెప్పారు. సిబ్బంది సేవలను పునరుద్ధరించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడిగా బెండ లచ్చన్న



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా హిందూ ఉత్సవ సమితి నూతన అధ్యక్షుడిగా రిటైర్డ్ సూపరింటెండెంట్ బెండ లచ్చన్న నియమితులయ్యారు. ఈ మేరకు సమితి ప్రతినిధులు అధికారికంగా ప్రకటించారు. ప్రభుత్వ రంగంలో సుదీర్ఘకాలం సేవలందించి సూపరింటెండెంట్గా ఉద్యోగ విరమణ పొందిన లచ్చన్న అనుభవం, సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధతను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా నియామకంపై బెండ లచ్చన్న హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన సమితి పెద్దలు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే హిందూ పండుగలు, ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా అందరి సహకారంతో శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయన నియామకం పట్ల పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# రేపు ఉట్నూర్ లో మెగా వైద్య శిబిరం




**ఉద్యమ కెరటం, జైనూర్:** ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హెడ్ సొసైటీ–ఉట్నూర్ ఆధ్వర్యంలో ప్రతిమా ఫౌండేషన్ కరీంనగర్ సహకారంతో ఈనెల 3న మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉట్నూర్లోని కేబీ కాంప్లెక్స్ సమీపంలో గల కేజీఎన్ ఫంక్షన్ హాల్ లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో సాధారణ వైద్యంతో పాటు దంత, గైనకాలజీ, పిల్లల వైద్యం, కంటి పరీక్షలు, చర్మ వ్యాధులు, ఎముకలు–కీళ్ల సమస్యలు, కిడ్నీ, గుండె సంబంధిత పరీక్షలు తదితర సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యుల సూచనలు, ఆరోగ్య సలహాలు అందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు, వృద్ధులు, మహిళలు, పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెడ్ సొసైటీ–ఉట్నూర్ ఫౌండర్ శ్రీకాంత్ జాదవ్, డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ నారాయణ జాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**

**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు వేగం పెంచి, నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య ఆదేశించారు. మంగళవారం తాండూర్ మండలంలో పర్యటించి వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. మాదారం గ్రామపంచాయతీలో ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ ప్రక్రియను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తూ వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో చేయూత పింఛన్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం తదితర కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెక్నికల్ అసిస్టెంట్లు తమ పరిధిలోని పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం బోయపల్లి ప్రీ-ప్రైమరీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించారు. బేస్లైన్ పరీక్షల ఫలితాలను పరిశీలించి, విద్యార్థుల అభ్యాసన స్థాయికి అనుగుణంగా బోధన విధానాలను రూపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి అదనపు తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. బోయపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ విచారణ ప్రక్రియను పరిశీలించి, హాజరైన వారి వివరాలను తెలుసుకున్నారు. ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి పారదర్శకంగా నమోదు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విచారణ నిర్వహించాలని అధికారులకు సూచించారు. పర్యటనలో తాండూర్ తహశీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# యూనిఫాంలను త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించడం ద్వారా వారికి ఉపాధి కల్పించడంతో పాటు ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని శ్రీ రేణుక మాత మహిళా శక్తి టైలరింగ్ సెంటర్ను మంగళవారం సందర్శించి యూనిఫాంల కుట్టు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యుల ద్వారా రోజుకు ఎన్ని యూనిఫాంలు కుడుతున్నారు, ఎంత ఆదాయం సమకూరుతోంది వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తంగళ్లపల్లి మండలంలోని 43 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3,560 మంది విద్యార్థులకు రెండేసి జతల చొప్పున యూనిఫాంలు కుట్టిస్తున్నట్లు అధికారులు కలెక్టర్కు వివరించారు. ఇందుకోసం నాలుగు టైలరింగ్ కేంద్రాల్లో 28 మంది మహిళా సంఘాల సభ్యులు పనిచేస్తుండగా, మొత్తం రూ.5.34 లక్షల ఆదాయం సమకూరనుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాలకు నిరంతర ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం యూనిఫాం కుట్టించే బాధ్యతను అప్పగించిందన్నారు. మహిళా సంఘాల సభ్యులు ప్రత్యేక శ్రద్ధతో పనిని వేగవంతం చేసి, యూనిఫాంలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసి అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, ఇన్చార్జి తహశీల్దార్ మురళి, ఎంపీడీఓ రమేష్ తదితరులు ఉన్నారు.





# నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

- **ఎల్ఎండీ పోలీస్స్టేషన్ తనిఖీ చేసిన కమిషనర్ గౌస్ ఆలం**

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** నేరాల నియంత్రణకు పటిష్ట నిఘా ఏర్పాటు చేసి, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం ఎల్ఎండీ పోలీస్స్టేషన్ను సందర్శించారు. స్టేషన్కు చేరుకున్న కమిషనర్కు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్స్టేషన్ ప్రాంగణం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి మొక్కలు నాటారు. జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, పెండింగ్ కేసుల ఫైళ్లు, రిసెప్షన్ నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. లాకప్ గదులు, ఆయుధాగారం, భద్రతా విభాగాలను తనిఖీ చేశారు. గ్రామాల వారీగా హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని, పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రాత్రి గస్తీ, బ్లూకోల్ట్స్, పెట్రోకార్ల రాకపోకలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, సాంకేతిక ఆధారాలతో చార్జిషీట్లు దాఖలు చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన కూడళ్లు, గ్రామాలు, కాలనీల్లో 'నేను సైతం' కార్యక్రమం ద్వారా సీసీ కెమెరాల ఏర్పాటును మరింత పెంచేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో రూరల్ ఏసీపీ విజయ్కుమార్, తిమ్మాపూర్ సీఐ బొల్లం రమేష్, ఎల్ఎండీ ఎస్ఐ అన్వర్ పాషా, పోలీస్స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.





# వసతిగృహాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** వృద్ధులు, దివ్యాంగులకు ఆప్యాయత, భరోసా కల్పిస్తూ వారి బాగోగులే లక్ష్యంగా కార్ఖానాగడ్డలోని ప్రభుత్వ వృద్ధులు, దివ్యాంగుల వసతి గృహాన్ని మరింత సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. మంగళవారం సాయంత్రం వసతిగృహాన్ని సందర్శించి అక్కడి వృద్ధులు, దివ్యాంగులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. అనంతరం ఇప్పటికే చేపట్టిన ఆధునీకరణ పనులను పరిశీలించారు. గతంలో మంజూరైన నిధులతో చేపట్టిన పనుల పురోగతి, ఇంకా చేపట్టాల్సిన పనులు, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెయింటింగ్ పనులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వసతిగృహంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనతో పాటు అవసరమైన మరమ్మతు పనులకు ఫేజ్-2 కింద మరిన్ని నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు, అంచనాలను సిద్ధం చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులకు మెరుగైన సౌకర్యాలు అందేలా సంక్షేమ శాఖ ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. వసతిగృహం కేవలం నివాస ప్రదేశంగా కాకుండా వృద్ధులు, దివ్యాంగులకు ఆత్మీయత, భద్రత, సౌకర్యం కల్పించే వాతావరణంగా ఉండేలా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, వార్డెన్ రాధిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



# ఆదిలాబాద్ ఏఎంసీ సభ్యురాలి మృతి

- **పార్థివ దేహానికి నివాళులర్పించిన చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఆదిలాబాద్ సభ్యురాలు రాధక్క, సమిత (కుర్సేంగే మోతిబాయి) అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణతో కలిసి మంగళవారం ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం తాంసీ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన తన మిత్రుడు చక్రధర్ రెడ్డి తండ్రి కంది గణపతి రెడ్డి ఇటీవల మరణించగా, శ్రీకాంత్ రెడ్డి వారి గృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ మెంబెర్ శేఖర్ రెడ్డి, లింబుగూడ సర్పంచ్ గుజునాక్ మాలిక్ రావు, కుంరం జంగు పటేల్, మెస్రం చిట్రూ, నారాయణ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, చింతల భగవండ్లు, కంతు, చిన్న బాపు, అలీం తదితరులు పాల్గొన్నారు.



# మొబైల్ ఫోన్ల రికవరీకి ప్రత్యేక చర్యలు

- ఈ ఏడాది రూ.1.81 కోట్ల విలువైన 1,133 ఫోన్లు స్వాధీనం
- సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 5,414 ఫోన్లు గుర్తింపు: జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర



**ఉద్యమ కెరటం, కామారెడ్డి:** మొబైల్ ఫోన్ పోయినా, చోరీకి గురైనా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర తెలిపారు. మొబైల్ ఫోన్లలో వ్యక్తిగత, బ్యాంకింగ్ సమాచారం ఉండటంతో వాటి రికవరీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఇన్స్పెక్టర్ సంపత్ పర్యవేక్షణలో ఆర్ఎస్సై బాలరాజు, ఐదుగురు కానిస్టేబుళ్లతో ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందం ప్రతినెల సగటున 150కి పైగా మొబైల్ ఫోన్లను రికవరీ చేస్తోందన్నారు. 20 రోజుల్లో రూ.23 లక్షల విలువైన 139 ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ ఏడాది ఇప్ప టివరకు రూ.1.81 కోట్ల విలువైన 1,133 ఫోన్లను రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో 5,414 మొబైల్ ఫోన్లను గుర్తించి, సుమారు రూ.8.66 కోట్ల విలువైన ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. గత ఏడాది రూ.3కోట్ల విలువైన 1,834 ఫోన్లను రికవరీ చేసినట్లు గుర్తుచేశారు. ఫోన్ పోయిన వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పాటు సిమ్ కార్డును బ్లాక్ చేసి, సీఈఐఆర్ పోర్టల్లో ఐఎంఈఐ నంబర్ను బ్లాక్ చేయాలని సూచించారు. గుర్తుతెలియని లింకులు, అనుమానాస్పద కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రికవరీ అయిన ఫోన్లను పొందేందుకు బాధితులు సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్ఎస్సై బాలరాజును సెల్: 8712686114 నెంబర్పై సంప్రదించాలని వివరించారు.

## సావర్ఖేడ్లో బస్టాప్ ఏర్పాటు చేయాలి



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** సావర్ఖేడ్ గ్రామంలో బస్టాప్ ఏర్పాటు చేసి, గ్రామ ప్రజలకు మెరుగైన బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సర్పంచ్ కావుడే తులసీరామ్, వార్డు సభ్యుడు శంకర్, గ్రామస్తులు మంగళవారం ఆసిఫాబాద్ డీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో బస్టాప్ లేకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని డీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, మహిళలు బస్సుల కోసం ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. గ్రామ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సావర్ఖేడ్లో బస్టాప్ ఏర్పాటు చేయడంతో పాటు బస్సుల సౌకర్యాన్ని పెంచాలని కోరారు. సానుకూలంగా స్పందించిన డీఎం సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పరామర్శ



**ఉద్యమ కెరటం, బిచ్కుంద:** మండలంలోని పత్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు అశోక్ పటేల్ మాతృమూర్తి ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మంగళవారం పత్లాపూర్ గ్రామానికి చేరుకుని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పత్లాపూర్ గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసిన సావర్ఖేడ్ సర్పంచ్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును సావర్ఖేడ్ గ్రామ సర్పంచ్ కావుడే తులసీరామ్, వార్డు సభ్యుడు ఎ.శంకర్, గ్రామస్తులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్రైడ్ రైస్ సెట్స్ మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. గ్రామ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. గ్రామంలో మౌళిక వసతుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తనవంతు సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాములు



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** భూ వివాదాల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమిని మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి మండలంలో కొనసాగుతున్న రీ-సర్వే ప్రక్రియపై తహశీల్దార్, సర్వేయర్ లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని తంగళ్ళపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. సర్వే చేసిన విస్తీర్ణానికి సంబంధించి కొ-రిలేషన్ స్టేట్మెంట్ను పూర్తి చేయాలని, రీ-సర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోగా ఎలాంటి జాప్యం లేకుండా సర్వే ప్రక్రియ పూర్తి చేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్మాణానికి భూమిపూజ



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పానాపటార్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్మాణానికి స్థానిక సర్పంచ్ ఆత్రం తులసి పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆత్రం లక్ష్మణ్ రావుతో కలిసి మంగళవారం భూమిపూజ చేశారు. కేంద్ర ప్రభుత్వం డీఎంజూగా నిధుల ద్వారా సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఈ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కన్నారు. పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్మాణం చేపట్టడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ఈ నిర్మాణాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆత్రం భీంరావు, గ్రామస్థులు ఆత్రం జగన్నాథ్, భీంరావు, సామాజిక కార్యకర్త ఆత్రం శంకర్ కొలాం, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో జాతీయ రహదారి 63 రహదారి నిర్మాణంలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి డిఎఓ రమేష్ తో కలిసి జాతీయ రహదారి విస్తరణలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63 విస్తరణలో అవార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను పకడ్బందీగా చేపట్టాలి

- రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బెల్లంపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సబ్ కలెక్టర్ మనోజ్తో కలిసి సందర్శించి భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్నిరకాల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడు తోందన్నారు. పాఠశాలలో నిర్మిస్తున్న భోజనశాల పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. చాకేపల్లి గ్రామంలో తహశీల్దార్ కృష్ణ, సర్వే అధికారులతో కలిసి రీ-సర్వే ప్రక్రియను ప్రారంభించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారంలో భాగంగా రీ-సర్వే చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో 11 నాన్ కడస్ట్రల్, 70 కడస్ట్రల్ గ్రామాలు కలిపి మొత్తం 81 గ్రామాలను రీ-సర్వేకు ఎంపిక చేసినట్లు వివరించారు. తెలంగాణ సర్వే అండ్ బౌండరీస్ చట్టం ప్రకారం సర్వే నిర్వహించాలని సూచించారు. గ్రామసభలు నిర్వహించి పట్టాదారులు, రైతులకు ముందస్తు సమాచారం అందించాలని, గ్రామ సరిహద్దులను నిర్ణయించాలని తెలిపారు. గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, అటవీ భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. అలాగే తాండూర్ మండలం మధునాపూర్ గ్రామ శివారులో వరి సాగు చేస్తున్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. తాండూర్ తహశీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలో నోటీసుల ప్రక్రియను పరిశీలించారు. భూ వివాదాల పరిష్కారానికి చేపట్టిన రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, భూముల రిజిస్ట్రేషన్ సమయంలో సీలింగ్ డిక్లరేషన్ను పరిశీలించి నిబంధనల ప్రకారం ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించారు. భూభారతి దరఖాస్తుల్లో భూమి విస్తీర్ణ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులతో సరిపోల్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు బజార్హత్నూర్లో వైఎస్సార్ వర్ధంతి



**ఉద్యమ కెరటం, బజార్హత్నూర్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు బజార్హత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కళ్లెం విఠల్ రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక మండల కాంగ్రెస్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బజార్హత్నూర్ మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు వర్ధంతి కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# విధ్యార్థులకు నాణ్యమైన బోజనం అందించాలి



**ఉద్యమ కెరటం, జైనూర్:** విద్యార్థులకు నాణ్యమైన బోజనం అందించాలని జైనూర్ మేజర్ గ్రామపంచాయితీ సర్పంచ్ కోడప ప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను మంగళవారం సందర్శించారు. వంట గదులను సందర్శించి అల్పాహారాన్ని పరిశీలించారు. వంటశాలతో పాటు పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు, వర్కర్లకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తాగునీరు, ఇతర సౌకార్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా అందించాలని కోరారు. ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకోనిరావాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఆడ అమృత్ తదితరులు ఉన్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**



# పాక్ క్రికెట్‌లో ముసలం!

## సెలెక్టర్ పదవికి మిస్బా రాజీనామా

## సీనియర్ల వేటుపై తీవ్ర అసంతృప్తి

## ఏడుగురు ఆటగాళ్లను ఇంటికి పంపిన పీసీబీ

## కోచ్ సర్ఫరాజ్, ఉమర్ గుల్‌పైనా వేటు

## ఇంగ్లండ్ చేతిలో సిరీస్ కోల్పోయిన పాక్

**లండన్:** అనిశ్చితికి మారుపేరుగా నిలిచే పాకిస్థాన్ క్రికెట్‌లో మరోసారి ముసలం మొదలైంది. ఇంగ్లండ్ పర్యటనలో వరుస పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీసుకున్న కఠిన నిర్ణయాలు జట్టులో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. సిరీస్ మధ్యలోనే సీనియర్ ఆటగాళ్లను స్వదేశానికి పంపడంతో పాటు కోచింగ్ బృందంపైనా వేటు వేయడాన్ని నిరసిస్తూ సెలెక్టర్ మిస్బావుల్ హక్ తన పదవికి రాజీనామా చేశాడు. లార్డ్స్ టెస్టులో పాకిస్థాన్ ఘోర పరాజయం తర్వాత పీసీబీ ప్రక్షాళనకు దిగింది. జట్టులోని ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపాలని నిర్ణయించింది. అంతటితో ఆగకుండా కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను బాధ్యతల నుంచి తప్పించి.. మూడో టెస్టుకు వైట్‌బాల్ కోచ్ మైక్ హెసన్‌కు బాధ్యతలు అప్పగించింది. బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌పైనా వేటు వేసింది. తాము ఎంపిక చేసిన జట్టులోని ఆటగాళ్లను సిరీస్ మధ్యలోనే తొలగించడం, కోచింగ్ బృందాన్ని మార్చడంపై మిస్బా తీవ్ర అసంతృప్తికి గురైనట్లు సమాచారం. బోర్డు నిర్ణయాలతో మనస్తాపం చెందిన అతడు మంగళవారం సెలెక్టర్ పదవికి హఠాత్తుగా రాజీనామా చేశాడు. అయితే మిస్బా రాజీనామాను పీసీబీ ఇంకా ఆమోదించాల్సి ఉంది. నేషనల్ క్రికెట్ అకాడమీలో బ్యాటింగ్ కోచ్ బాధ్యతల నుంచి కూడా అతడు తప్పుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. లార్డ్స్ టెస్టు పరాజయం తర్వాత మహ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘా, అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, అవైస్ జఫార్, ఖుర్రం షెహజాద్‌లను జట్టు నుంచి తప్పించినట్లు సమాచారం. వీరి స్థానంలో సయీం అయూబ్‌తో పాటు అరాఫత్ మిన్హాస్, మహ్మద్ ఇమ్రాన్, సాద్ బైగ్, ఇమ్రాన్ రంధవా, రజుల్లాహ్ తదితర యువ ఆటగాళ్లకు చివరి టెస్టులో అవకాశం కల్పించనున్నారు. హెడింగ్లేలో తొలి టెస్టును సొంతం చేసుకున్న ఇంగ్లండ్.. లార్డ్స్‌లోనూ జోరు కొనసాగించింది. 389 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ బ్యాటింగ్ మరోసారి కుప్పకూలింది. షాద్ షకీల్ 97 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. ఓలీ రాబిన్సన్ (4-24), జోష్ టంగ్ (3-46), జోఫ్రా ఆర్చర్ (2-73) విజృంభించడంతో ఇంగ్లండ్ 194 పరుగుల భారీ తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఇంగ్లండ్ సిరీస్‌ను కైవసం చేసుకోగా.. పాకిస్థాన్‌కు మూడో టెస్టు నామమాత్రంగా మారింది. చివరి టెస్టు సెప్టెంబర్ 9న బర్మింగ్‌హమ్‌లో జరగనుంది. ఓవైపు వరుస ఓటములు.. మరోవైపు సీనియర్లపై వేటు.. ఇప్పుడు సెలెక్టర్ మిస్బా రాజీనామా.. వెరసి పాకిస్థాన్ క్రికెట్‌లో మరోసారి సంక్షోభ మేఘాలు కమ్ముకున్నాయి.

# టెన్నిస్ కోర్టే ఫ్యాషన్ ర్యాంప్!

- బాస్కెట్‌బాల్ దిగ్గజం లుక్‌లో ఒసాకా
- అలెన్ ఐవెర్సన్‌కు స్టయిల్‌తో నివాళి
- యూఎస్ ఓపెన్‌లో మరోసారి ప్రత్యేక ఆకర్షణ
- ఆటతో పాటు ఫ్యాషన్‌లోనూ తనదైన ముద్ర
- తొలి రౌండ్‌లో గెలిచి ముందంజ



**న్యూయార్క్:** టెన్నిస్ కోర్టులో ఆటతో ప్రత్యర్థులను హడలెత్తించడమే కాదు.. తన ఫ్యాషన్‌తో ప్రేక్షకులను అబ్బురపరచడం జపాన్ స్టార్ నవోమి ఒసాకాకు కొత్తేమీ కాదు. గ్రాండ్‌స్లామ్ టోర్నీ వచ్చిందంటే చాలు.. ఏదో ఒక ప్రత్యేక థీమ్‌తో కోర్టులోకి అడుగుపెట్టి అందరి దృష్టినీ ఆకర్షిస్తుంటుంది. తాజాగా యూఎస్ ఓపెన్-2026లోనూ అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. ఈసారి అమెరికా బాస్కెట్‌బాల్ దిగ్గజం అలెన్ ఐవెర్సన్‌ను గుర్తుచేసే లుక్‌తో వచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్ కోసం ఒసాకా వినూత్న వేషధారణతో కోర్టులోకి వచ్చింది. పొడవాటి తెల్లని స్కర్ట్, వదులుగా ఉన్న హుడీతో ప్రవేశించిన ఆమె.. ఆ తర్వాత వాటిని తొలగించి ఐవెర్సన్‌ను తలపించే స్టయిల్‌లో కనిపించింది. జుట్టును 'కార్న్‌రోస్' తరహాలో తీర్చిదిద్దుకోవడంతో ఆమె లుక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కోర్టులోకి వచ్చే ముందు ఐవెర్సన్ చిత్రం ముద్రించిన షర్ట్‌ను ధరించి అతడిపై తనకున్న అభిమానాన్ని చాటుకుంది. తన కొత్త లుక్‌పై ఒసాకా స్పందిస్తూ.. ఐవెర్సన్ ఆటతో పాటు అతడి ఫ్యాషన్ తనకు ఎంతో ఇష్టమని తెలిపింది. తనదైన స్టయిల్‌తో బాస్కెట్‌బాల్ ప్రపంచంలో ప్రత్యేక ముద్ర వేసిన ఐవెర్సన్.. క్రీడాకారుల దుస్తుల తీరుపైనా ప్రభావం చూపాడని పేర్కొంది. 'ఫ్యాషన్‌తోనూ మన వ్యక్తిత్వాన్ని చెప్పొచ్చు' అన్న భావనను ఒసాకా వ్యక్తం చేసింది. తనను అనుకరిస్తూ ప్రత్యేక లుక్‌లో కోర్టులోకి వచ్చిన ఒసాకాపై ఐవెర్సన్ కూడా ప్రశంసలు కురిపించాడు. తనకు దక్కిన గొప్ప గౌరవంగా దీనిని అభివర్ణిస్తూ ఆమెను ప్రత్యక్షంగా చూసేందుకు ఎదురుచూస్తున్నట్లు సందేశం పంపాడు. ఫ్యాషన్‌తోనే కాకుండా ఆటలోనూ ఒసాకా ఆకట్టుకుంది. తొలి రౌండ్‌లో జఖరోవాపై విజయం సాధించి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. విభిన్న వేషధారణతో గ్రాండ్‌స్లామ్‌లలో సందడి చేయడం ఒసాకాకు అలవాటే. గత యూఎస్ ఓపెన్‌లో 'లబుబు' బొమ్మలతో ప్రత్యేకంగా కనిపించి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ ఆక్వా బ్లూ రంగు జాకెట్, వెడల్పాటి తెల్లని ప్యాంట్, తెల్లటి ముసుగు, టోపీ, చేతిలో గొడుగుతో ఫ్యాషన్ సుందరిలా కోర్టులోకి అడుగుపెట్టి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. రాకెట్‌తో ఆటలో తనదైన ముద్ర.. వేషధారణతో ఫ్యాషన్‌లో ప్రత్యేక ముద్ర.. రెండింటినీ కలిపి టెన్నిస్ కోర్టునే ఫ్యాషన్ వేదికగా మార్చేస్తోంది నవోమి ఒసాకా.

# పాటిదార్‌పై ఇషాన్ పైచేయి!

- దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్‌జోన్
- 4 వికెట్ల తేడాతో సెమీస్‌లో గెలుపు
- వైభవ్, ఇషాన్ మెరుపు బ్యాటింగ్
- ఏడు వికెట్లతో ముకేశ్ కుమార్ సత్తా
- దూబే తిప్పేసినా తప్పని ఓటమి



**బెంగళూరు:** దేశవాళీ సీజన్‌లో ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీలో ఈస్ట్‌జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇషాన్ కిషన్ సేన సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌ను నాలుగు వికెట్ల తేడాతో ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (40), కెప్టెన్ ఇషాన్ కిషన్ (39) బ్యాట్‌తో మెరవగా.. ముకేశ్ కుమార్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లతో విజయంలో కీలకపాత్ర పోషించాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో జరిగిన సెమీఫైనల్లో తొలి ఇన్నింగ్స్‌లో రింకూ సింగ్ (60) అర్ధశతకంతో రాణించినా ప్రత్యర్థి జట్టు 266 పరుగులకే ఆలౌటైంది. అనంతరం హర్ష్ దూబే (4-66), ఆర్యన్ పాండే (3-43) బంతితో విజృంభించడంతో ఈస్ట్‌జోన్ కూడా సరిగ్గా 266 పరుగులకే కుప్పకూలింది. దీంతో తొలి ఇన్నింగ్స్ ముగిసేసరికి రెండు జట్లు సమానంగా నిలిచాయి.

### ముకేశ్ దెబ్బకు 158కే కుప్పకూలి..

రెండో ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించి ఈస్ట్‌జోన్‌కు సవాల్ విసరాలని భావించిన ప్రత్యర్థి జట్టుకు ముకేశ్ కుమార్, అభిజిత్ సర్కార్ షాకిచ్చారు. వీరిద్దరి ధాటికి బ్యాటింగ్ లైనప్ నిలవలేక 158 పరుగులకే ఆలౌటైంది. దీంతో ఈస్ట్‌జోన్ ముందు 159 పరుగుల లక్ష్యం నిలిచింది.

### వైభవ్ ధనాధన్.. ఇషాన్ దంచుడు

స్వల్ప లక్ష్య ఛేదనలో ఈస్ట్‌జోన్ ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (24), వైభవ్ సూర్యవంశీ (40) దూకుడుగా ఆడి శుభారంభం అందించారు. ముఖ్యంగా వైభవ్ వేగంగా పరుగులు రాబట్టి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాడు. అయితే హర్ష్ దూబే మరోసారి బంతితో చెలరేగి 53 పరుగులకు నాలుగు వికెట్లు పడగొట్టడంతో ఈస్ట్‌జోన్ కాస్త తడబడింది. అయితే గాయం కారణంగా రెండో రోజు ఆటకు దూరమైన కెప్టెన్ ఇషాన్ కిషన్ కీలక సమయంలో బాధ్యత తీసుకున్నాడు. 39 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయానికి చేరువ చేశాడు. చివర్లో మహమ్మద్ షమీ విన్నింగ్ షాట్ కొట్టడంతో ఈస్ట్‌జోన్ నాలుగు వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుని ఫైనల్లో అడుగుపెట్టింది. దూబే రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ బంతితో పోరాడినా.. వైభవ్ దూకుడు, ఇషాన్ కీలక ఇన్నింగ్స్, ముకేశ్ కుమార్ బౌలింగ్ జోరుతో ఈస్ట్‌జోన్ ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది.



# అన్ని ఫార్మాట్ల పేసర్‌గా ఎదగాలి

## అదే నా లక్ష్యం: గుర్నూర్ బ్రార్

**బెంగళూరు:** మూడు ఫార్మాట్లలోనూ సత్తా చాటగల పేసర్‌గా ఎదగడమే తన ప్రధాన లక్ష్యమని భారత యువ ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్ తెలిపాడు. సీనియర్ పేసర్లు జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలతో కలిసి బౌలింగ్ చేయడం తనకు ఎంతో ఉపయోగపడిందని చెప్పాడు. ముఖ్యంగా బంతిని సరైన లెంగ్త్‌లో వేయడంలో స్థిరత్వం సాధించేందుకు వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు పేర్కొన్నాడు. ఇప్పటివరకు భారత్ తరఫున ఆరు వన్డేలు ఆడిన గుర్నూర్ 6.96 ఎకానమీతో 11 వికెట్లు పడగొట్టి అంతర్జాతీయ కెరీర్‌కు మంచి ఆరంభం ఇచ్చాడు. రంజీ ట్రోఫీ, ఇండియా 'ఎ' తరఫున కనబరిచిన ప్రదర్శనతోనే భారత జట్టులో అవకాశం దక్కిందని తెలిపాడు. "బౌలింగ్‌లో లెంగ్త్‌ను నిలకడగా కొనసాగించడం, పిచ్ పరిస్థితులకు అనుగుణంగా ఒక్కో బ్యాటర్‌కు ఎలా బౌలింగ్ చేయాలన్న అంశాలపై మరింత అవగాహన పెంచుకుంటున్నా. ఎన్ని ఓవర్లు వేసినా శరీరంపై ఎక్కువ ప్రభావం పడకుండా ఫిట్‌నెస్‌ను తీర్చిదిద్దుకోవాలన్నది మొదటి నుంచీ నా లక్ష్యం" అని గుర్నూర్ చెప్పాడు. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఇచ్చిన సలహాలతో తన బౌలింగ్‌లో గణనీయమైన మార్పు వచ్చిందన్నాడు. "బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణల బౌలింగ్‌ను దగ్గరగా పరిశీలించా. వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. వారిలాగే అన్ని ఫార్మాట్లలో రాణించే పేసర్‌గా ఎదగడానికి ప్రయత్నిస్తున్నా" అని పేర్కొన్నాడు. ప్రస్తుతం దులీప్ ట్రోఫీలో నార్త్‌జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న గుర్నూర్ బ్రార్.. సౌత్‌జోన్‌తో జరిగిన సెమీఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టి మరోసారి తన సత్తా చాటాడు.

# ఆఫ్ఘన్‌తో టీ20 పోరుకు టీమిండియా రెడీ

- కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్
- వైస్ కెప్టెన్‌గా తిలక్ వర్మ
- వైభవ్ సూర్యవంశీకి జట్టులో చోటు
- బుమ్రా పునరాగమనం
- సెప్టెంబర్ 13 నుంచి మూడు మ్యాచ్‌ల సిరీస్



**న్యూఢిల్లీ:** ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును పురుషుల సెలక్షన్ కమిటీ ప్రకటించింది. ఈ సిరీస్‌లో టీమిండియాకు శ్రేయాస్ అయ్యర్ నాయకత్వం వహించనుండగా.. హైదరాబాదీ యువ బ్యాటర్ తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. జట్టులో సీనియర్లతో పాటు యువ ఆటగాళ్లకు సెలక్టర్లు ప్రాధాన్యం ఇచ్చారు. బ్యాటింగ్ విభాగంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కింది. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ కూడా జట్టులో చోటు సంపాదించారు. సంజూ, ఇషాన్ వికెట్ కీపర్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆల్‌రౌండర్ల కోటాలో శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లకు అవకాశం లభించింది. స్పిన్ బాధ్యతలను వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ పంచుకోనున్నారు.

### బుమ్రా పునరాగమనం

పేస్ విభాగంలో స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రావడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అతడితో పాటు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా పేస్ బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే బుమ్రా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణాల ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి ఉంటుందని సెలక్షన్ కమిటీ తెలిపింది.

### సెప్టెంబర్ 13 నుంచి సమరం

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో 3 టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. యువ ఆటగాళ్లకు అవకాశమిస్తూ, అనుభవజ్ఞులను జోడించి ఎంపిక చేసిన భారత జట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో పోరుకు సిద్ధమవుతోంది. భారత జట్టు: శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
బుధవారం
2 సెప్టెంబర్ 2026

# మూడు సినిమాలతో మమిత బైజు హ్యాట్రిక్

'ప్రేమలు'తో ఒక్కసారిగా యూత్ క్రష్‌గా మారిన మమితా బైజు .. ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. తన క్యూట్‌నెస్‌తో కట్టిపడేసే ఈ మలయాళ ముద్దుగుమ్మ.. తాజాగా భారతీయ సినీ చరిత్రలోనే ఎవరూ సాధించని ఒక అరుదైన మైలురాయి చేరుకుంది. కేవలం 29 రోజుల వ్యవధిలో ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు వరుసగా రూ.200 కోట్లకుపైగా వసూలు చేసి.. హ్యాట్రిక్ కొట్టిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించింది. ఎన్నో వాయిదాల తర్వాత జులై 23న వచ్చిన 'జననాయగన్' విజయాన్ని అందుకుంది. విజయ్ నటించిన చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉండడంతో బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇందులో మమిత.. విజ్జి పాత్రలో ఆకట్టుకుంది. సూర్య కథానాయకుడిగా విశ్వనాథ్ అండ్ సన్స్..: భారీ చిత్రం విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.240 కోట్ల గ్రాస్‌తో ఘన విజయం సాధించింది. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో మమిత నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అల్లరి చేసే పిల్లగా ఆకట్టుకున్న ఆమె.. అమ్మగానూ హృదయానికి హత్తుకునే నటనతో మెప్పించింది. బెత్లెహోమ్ కుటుంబ యూనిట్..: నివిన్ పౌలీతో కలిసి మమిత నటించిన ఈ మలయాళ చిత్రం ఆగస్టు 21న విడుదలై సంచలనం విజయం అందుకుంది. ఇప్పటికే రూ.200 కోట్ల మార్క్ దాటి రూ.250 కోట్ల దిశగా దూసుకుపోతోంది. దీన్నే తెలుగులో సెప్టెంబరు 4న విడుదల చేయనున్నారు.







# నవంబర్ 27న మైసా విడుదల


## రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

కథానాయిక రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ రిలీజ్ డేట్ ప్రకటన సందర్భంగా మేకర్స్ పంచుకున్న క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సహజంగానే ఆమె దృఢమైనది.. ఎంచుకున్న మార్గంలో భయం లేనిది.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. మునుపెన్నడూ చూడని విధంగా 'మైసా' ప్రపంచంలో రష్మికను చూసేందుకు సిద్ధంగా ఉండండి అంటూ చిత్ర బృందం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. మునుపెన్నడూ లేని విధంగా రష్మిక ఈ సినిమాలో పూర్తిస్థాయి యాక్షన్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి. రష్మిక కథానాయిక. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. దసరా కానుకగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇటీవలే చిత్ర బృందం స్పష్టం చేసింది.




# కరీనా కపూర్ క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ మరియు టాలెంటెడ్ నటుడు పృధ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూని కోహ్లీగా, పృధ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా ప్రత్యర్థి పోలీసు అధికారులుగా కనిపించనున్నారు. చట్టం వర్సెస్ న్యాయం, నకిలీ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అయిన రామన్ కుమార్‌పై మరో పోలీసు అధికారి అజూని కోహ్లీ దర్యాప్తు చేసే తీవ్రమైన సన్నివేశాలతో ట్రైలర్ ఎంతో ఆసక్తికరంగా సాగింది. జంగ్లీ పిక్చర్స్, పెన్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను మేఘనా గుల్జార్ యదార్ధ ఘటనల ఆధారిత సీరియస్ డ్రామాగా మలిచారు. సస్పెన్స్ మరియు హై-వోల్టేజ్ డ్రామాతో కూడిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న విడుదల కానుండగా, ప్రస్తుతం ఈ ట్రైలర్ సినీ వర్గాల్లో భారీ అంచనాలను పెంచేసింది.




# టాక్సిక్‌కు హాఫ్ స్టార్ రేటింగ్

## లెటర్ బాక్స్‌లో మహేశ్ బాబు తనయుడు గౌతమ్

## టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కుమారుడు గౌతమ్ ప్రముఖ సోషల్ మీడియా రేటింగ్ యాప్

లెటర్‌బాక్స్ ద్వారా ఇచ్చిన సినిమా రేటింగ్‌లు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. యశ్ హీరోగా నటించిన 'టాక్సిక్' సినిమాకు గౌతమ్ కేవలం హాఫ్ స్టార్ (0.5) ఇవ్వడం, అలాగే తన తండ్రి మహేష్ బాబు సినిమాలకే కాకుండా ఇతర స్టార్ హీరోల చిత్రాలకు ఇచ్చిన రేటింగ్‌లు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గౌతమ్ లెటర్‌బాక్స్ ప్రొఫైల్ ప్రకారం.. అతను ఇప్పటివరకు వివిధ భాషలు మరియు జోనర్లకు చెందిన 400లకు పైగా సినిమాలను వీక్షించినట్లు తెలుస్తోంది. అయితే ఇతరులతో సంబంధం లేకుండా, సినిమాల కంటెంట్‌ను బట్టి స్వతంత్రంగా రేటింగ్‌లు ఇవ్వడం ఈ డిబేట్‌కు ప్రధాన కారణమైంది. తన తండ్రి మహేష్ బాబు నటించిన కల్ట్ క్లాసిక్స్ 'పోకిరి', '1: నేనొక్కడినే' సినిమాలకు గౌతమ్ 5 నక్షత్రాల రేటింగ్ ఇవ్వగా, 'బ్రహ్మోత్సవం' చిత్రానికి కేవలం 1 స్టార్ మాత్రమే ఇచ్చాడు. అలాగే 'నిజం', 'వంశీ' చిత్రాలకు 2 చొప్పున రేటింగ్ ఇచ్చాడు. కేవలం టాలీవుడ్ మాత్రమే కాకుండా పాన్-ఇండియా, హాలీవుడ్ సినిమాలపై కూడా గౌతమ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. 'బాహుబలి 2' చిత్రానికి 5 స్టార్లు ఇవ్వగా, 'పెళ్లిచూపులు', 'సీతారామం' సినిమాలకు 4.5 రేటింగ్ ఇచ్చాడు. మరోవైపు, యశ్ 'టాక్సిక్' చిత్రంతో పాటు విజయ్ దేవరకొండ 'లైగర్' మూవీకి కూడా అర నక్షత్రం రేటింగ్ ఇవ్వడం విశేషం. ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి 2.5 రేటింగ్ ఇచ్చాడు. ఇక సినిమా కుటుంబానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, బంధుప్రీతికి తావు ఇవ్వకుండా సినిమాలోని కంటెంట్ ఆధారంగా నిజాయితీగా రేటింగ్‌లు ఇస్తున్నాడని కొందరు నెటిజన్లు గౌతమ్‌ను ప్రశంసిస్తుంటే, మరికొందరు సెలబ్రిటీ కుటుంబాల నుంచి ఇలాంటి బహిరంగ రేటింగ్‌లు రావడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. సెలబ్రిటీల పిల్లలు అయినంత మాత్రాన వారి వ్యక్తిగత అభిప్రాయాలు, సినిమా రుచి ఇతరులలాగే ఉండటంలో తప్పులేదని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**